
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

బుధవారం 20 మార్చి 2024





నేతన్నపై.. నిర్లక్ష్యం

నేతన్నలు.. అబ్బుర పరిచే వస్త్ర కళా నైపుణ్యం వారిది. సమస్యలతో దశాబ్దాలుగా పోరాటం చేస్తూ అతికష్టంగా మనుగడ సాగిస్తున్నారు. వేల ఏళ్ల చరిత్ర ఉన్నా.. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు వారివి. రెక్కలిరిగేలా.. కీళ్లు అరిగేలా చాకిరి చేస్తున్నా.. ఐదు వేళ్లూ నోటికెళ్లని పరిస్థితి వారిది. వారి చేతి వేళ్లలో ప్రపంచాన్ని అబ్బుర పరిచే వస్త్ర కళా నైపుణ్యం ఉన్నా వారి బతుకులు మాత్రం మారడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక చేనేత కార్మికులు కోలుకోలేనంతగా దెబ్బ తిన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఒక రిద్దరికి పదో పరకో చిల్లర రాల్చిన ప్రభు త్వం చేనేత సంరక్షణ చర్యలను పూర్తిగా పక్కన పెట్టింది. ఫలితంగా చేనేత వృత్తి మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

- తాయిలాలతో సరి.. చేనేతకు ఉరి
- వృత్తి రక్షణను వదిలేసిన పాలకులు
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైపోతున్న నేతన్నలు
- వైసీపీ పాలనలో ఘోరంగా పతనమైన పరిశ్రమ
- అప్పుల భారం, ఆకలిచావుల దశకు చేరిన పరిశ్రమ

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో వ్యవసాయం తర్వాత అతిపెద్ద రంగం చేనేత. దేశంలోనే అతిపెద్ద చేనేత ప్రాంతంగా బాపట్ల జిల్లా చీరాల- వేటపాలెం గుర్తింపు పొందింది. ఈ మూడు జిల్లాల్లో అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 30 వేల మగ్గాలున్నాయి. వాటిపై లక్ష మందికి పైగా చేనేత కార్మిక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. బాపట్ల జిల్లాలోనే దాదాపు 17వేల చేనేత మగ్గాలున్నట్లు చేనేత జౌళిశాఖ లెక్కలు చెబుతున్నాయి. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మరో 13 వేలకు పైగా మగ్గాలు నమోదై వున్నాయి. బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, చెరుకుపల్లి, వలపర్ల, రేపల్లె, పేటేరు, భట్టిప్రోలు, ఇసుకపల్లి, రాజోలు, కనగాల మొదలు గుంటూరు జిల్లాలోని మంగళగిరి చుట్టుపక్కల గ్రామాలు, తెనాలి, పొన్నూరు, పల్నాడు జిల్లా సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, గణపవరం, తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. స్వయంపోషకంగా ఉన్న ఈ రంగానికి కొద్దిపాటి ఊతం ఇస్తే సరిపోతుంది. కానీ వైసీపీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వాలు ఇచ్చిన చేయూతను కూడా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా చేనేత పరిశ్రమ ఘోరంగా దెబ్బతింది. దీంతో చాలా చోట్ల చేనేత మగ్గాలే కనుమరుగై పోయాయి. 2020లో కరోనా నివారణ కోసం చేపట్టిన లాక్‌డౌన్ చేనేత కార్మికుల వృత్తికి లాక్‌డౌన్‌గా పరిణమించాయి. ఆనాటి నుంచి ఈనాటి వరకూ చేనేత కార్మికులకు చేసేందుకు పని దొరకని పరిస్థితి.

టీడీపీ హయాంలో ఊరట

గతంలో టీడీపీ ప్రభుత్వం చేనేత సంరక్షణకు నూలు, రంగులపై సబ్సిడీ ఇచ్చింది. చేనేత సహాయ నిధి, పొదు పు నిధి, రంగుల కోసం రూ.25 కోట్లు, మూల ధనం కింద రూ.30 కోట్లు, మరమగ్గాలకు రాయితీ కింద రూ.80 కోట్లు కేటాయించి ఖర్చు చేశారు. కుటుంబా నికి 100 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు, 50 ఏళ్లు దాటిన లక్షా 11 వేల మంది చేనేతలకు 2వేలు చొప్పున పించన్లు అందజేశారు. ఇవి చేనేత పరిశ్రమ ను రక్షించడానికే కాకుండా, కార్మికులకు వ్యక్తిగతంగా కూడా కొంత ఊరటనిచ్చేవి. అయితే వైసీపీ ప్రభుత్వం టీడీపీ హయాంలో అమలైన పథకాలనన్నింటినీ రద్దు చేసేసింది. దీంతో చేనేత కార్మికులకు గడ్డిపోచ సాయం కూడా వారికి లభించలేదు. చేనేత వస్త్రాలకు దేశంలోనే కాదు.. ప్రపంచంలో కూడా అంతులేని ఆదరణ ఉంది. నైపుణ్యం కలిగిన కార్మికులు ఉన్నారు. ఈ రెండింటినీ సమన్వయం చేసే ప్రభుత్వ ఆదరణే పరిశ్రమకు కరువైంది. కార్మికుల ఉపాధి విషయాన్ని గాలికి వదిలి వైసీపీ ప్రభుత్వం కేవలం తాయిలాలకే పరిమితమైంది. రూ.2.97 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 200 కోట్లు మాత్రమే కేటాయించారు. అది కూడా చేనేత జౌళిశాఖ ఉద్యోగుల జీతాలకు, నేతన్న నేస్తానికి కూడా సరిపోదు. అంతలా గడిచిన ఐదేళ్లలో చేనేత నిర్లక్ష్యానికి గురైంది. లక్షమందికిపైగా ఉన్న చేనేత కార్మికుల్లో 10 వేల మందికి నేతన్న నేస్తం ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. ఈ లబ్ధి పొందేవారిలో చేనేత రంగంలోని అట్టడుగువర్గమైన సొంత ఇల్లు, సొంత మగ్గం లేని షెడ్డు కార్మికులు మాత్రం ఉండరు. కొద్దోగొప్పో సొంత ఇల్లు, సొంత మగ్గం ఉన్న కార్మికులకు మాత్రమే ప్రభుత్వం నేతన్న నేస్తం అందిస్తోంది. ఫలితంగా చేనేత కార్మికుల పరిస్థితి గడిచిన నాలుగేళ్లలో కోలుకోలేనంతగా దెబ్బతినిపోయింది.

చేనేతకు చేయూత పేరుతో లోకేశ్ కృషి

చితికి పోతున్న చేనేతను సంరక్షించేందుకు టీడీపీ యువనేత నారా లోకేశ్ తన నియోజకవర్గమైన మంగళగిరిలో కొంత ప్రయత్నం చేశారు. నేతన్నలకు అధునాతన యంత్ర సామగ్రిని అందించడంతోపాటు, సమస్యల మూలాల్లోకి వెళ్లి చేనేత సంరక్షణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నేతన్నలకు ఉపకరించే అధునాతన రాట్నాలు, మరమగ్గాలు అందజేస్తున్నారు. మంగళగిరి పరిధిలో ఉన్న ప్రముఖ చేనేతకారులతో చర్చించి నిర్దిష్టమైన కార్యక్రమం రూపొందించే ప్రయత్నం చేస్తున్నారు. కార్పొరేట్ మార్కెటింగ్ సంస్థల ద్వారా స్పాన్సర్‌షిప్ తీసుకువచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆ మేరకు పలు సంస్థల అధినేతలు, ఎన్‌ఆర్‌ఐల సహకారం తీసుకుంటున్నారు.



చీరాలలో బూజుపట్టిపోయిన చేనేత మగ్గాలు

చేనేతను రక్షించాలి

చేనేతను రక్షించకపోతే కార్మికులకు ఆకలిచావులే శరణ్యం. నాలుగేళ్లుగా చీరాల పరిసర ప్రాంతాల్లో చేనేత కార్మికులకు పనిలేదు. నేతన్న నేస్తం కొద్ది మందికే ఇస్తున్నారు. కార్మికులకు పని కల్పిస్తే నేతన్న నేస్తం లేకపోయినా హాయిగా బతుకుతారు. కానీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోవడంలేదు. పనిలేని కారణంగా చాలా మంది టీస్టాళ్లు, హోటళ్లలో కప్పులు కడిగే పనికి పోతున్నారు.



- జి. సుబ్బారావు, చేనేత నాయకుడు



ఆసరా.. అంతేనా?

కోడ్‌తో లబ్ధిదారుల్లో ఆందోళన

- రెండు నెలలైనా ఊసే లేని రుణమాఫీ
- 70 వేల మందికి ఒకరిద్దరి ఖాతాల్లోనే నగదు
- బటన్ నొక్కి రోజులు గడుస్తున్నా అందని లబ్ధి

విడతల సంక్షేమం వాయిదాల పర్వంలో సాగింది. ఏకంగా ముఖ్యమంత్రి బటన్లు నొక్కుతున్నా సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగద గగనమవుతోంది. డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిని అందజేస్తున్నామని చెప్తున్నా.. లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరగ డం సర్వసాధారణంగా మారుతుంది. సంక్షేమ పథకాల అమలే మా అజెండా అని చెప్పుకుం టున్న ప్రభుత్వం ఆచరణలో లబ్ధిదా రులను మోసం చేస్తోంది. ప్రధానంగా మహిళలకు చేయూత అందించే పథకాల్లో తన పని తనం చూపిస్తోంది. ఉత్తుత్తి బటన్లు నొక్కి ముఖ్యమంత్రి ఏమార్చుతున్నారని లబ్ధి దారులు మండిపడుతున్నారు. ముఖ్య మంత్రి బటన్ నొక్కారు కదా మన ఖాతా ల్లో నగదు జమై ఉంటుందని ఆశగా బ్యాం కులకు వెళ్తున్న మహిళలకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది.

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ అర్హత పొందిన మహిళలు 7 లక్షల మంది ఉన్నారు. వారికి ప్రభుత్వం నాలుగు దఫాలుగా 2,800 కోట్ల రూపాయలు రుణమాఫీ కింద నగదు చెల్లించాలి. కాగా పథకాన్ని ఆలస్యంగా మొదలుపెట్టడం, అమలులో వాయిదాల మధ్య దూరం పెంచడం కారణంగా ఐదేళ్లలో మూడు సార్లు మాత్రమే రుణమాఫీ చేసింది. తాజాగా ఈ ఏడాది జనవరి 23న నాలుగో విడత ఆసరా పథకానికి ముఖ్యమంత్రి బటన్ నొక్కినా రుణమాఫీ నగదు మాత్రం లబ్ధిదారులందరికీ అందలేదు. నాలుగో విడత రూ.700 కోట్ల రుణమాఫీ జరగాలి. బటన్ నొక్కి రెండు నెలలు కావస్తున్నా మెజారిటీ లబ్ధిదారులకు ఆసరా రుణమాఫీ డబ్బులు పడలేదు. గడిచిన రెండు నెలల్లో అక్కడక్కడా చెదురుమదురుగా ఆసరా డబ్బు పడినా, ఆ తర్వాత ఆగిపోయింది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. దీనికి తోడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో లబ్ధిదారుల్లో మరింత కలవరం కనిపిస్తోంది.

● చేయూత పథకంలో జాప్యం

చేయూత పథకాన్ని ప్రభుత్వం వాయిదాల పద్ధతిలో జాప్యం చేసుకుంటూ వచ్చింది. మరో వారం రోజుల్లో ఎన్నికల నగారా మోగుతుందనగా మార్చి 7న ముఖ్యమంత్రి బటన్ నొక్కారు. 2023 సెప్టెంబరులో ప్రా రంభిస్తామన్న పథకం ఆ తర్వాత నవంబరుకు, అక్కడ నుంచి డిసెంబరుకు, ఆపై జనవరికి వాయిదా పడి చిట్టచివరకు మార్చిలో ప్రారంభానికి నోచుకుంది. కానీ దీనికి సంబంధించి లబ్ధిదారుల్లో చాలా మందికి నగదు జమ కాలేదు. పథకానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు లేవు. దీంతో ప్రభుత్వం అరకొరగా నిధులు మంజూరు చేస్తోంది. గడిచిన రెండు వారాల్లో మూడు జిల్లాల్లో మూడో వంతు మందికి కూడా చేయూత దక్కలేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ఎక్కడో ఒకరికి నగదు పడితే తమకు కూడా నగదు జమైందే మోనన్న ఆశతో లబ్ధిదారులు బ్యాంకుల వద్దకు పదేపదే వెళ్తున్నారు. కానీ నగదు మాత్రం వారికి దక్కలేదు.

● కోడ్ వచ్చినా పంపిణీలో మతలబేంటి ?

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక కూడా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేయడమే అధికార వైసీపీ ఎత్తుగడగా కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను నిర్వహించడం సాంకేతికంగా తప్పు. దీంతో ప్రభుత్వం ఎన్నికల ముందు పథకాలన్నింటినీ హడావుడిగా ప్రారంభించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కూడా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమయ్యేలా దశల వారీగా నగదు విడుదల చేస్తూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తోందా? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎన్నికల సంఘం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

ఆది నుంచి ఆలస్యం

అధికారంలోకి వచ్చిన తొలి ఆరు నెలల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తే అది జగన్ ప్రభుత్వం అని డప్పాలు కొట్టుకునే వైసీపీ నేతలు ఆది నుంచి ఆసరా, చేయూత పథకాలను జాప్యం చేస్తూనే వచ్చారు. అధికారం చేపట్టిన ఏడాదిలో పథకాలను ప్రారంభించకుండా దాదాపు 15 నెలల తర్వాత తీరిగ్గా పథకాలను ప్రారంభించారు. విడతల వారీ అమలు పేరుతో ప్రతి విడతలో మరింత జాప్యం చేస్తూ పథకాన్ని నీరుగార్చారు. సవాలక్ష ఆంక్షలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యలో కోత పెట్టారు. దొంగ లెక్కలు చూపి అర్హులు అనేకమందిని పథకానికి దూరం చేశారు.

టీడీపీ కార్యకర్త కారు దహనం

- పెట్రోల్ పోసి తగలబెట్టినట్లు ఆరోపణ
- బాధితుడ్ని పరామర్శించిన బ్రహ్మారెడ్డి



దహనమవుతున్న వాహనం

మాచర్లటౌన్, మార్చి 19: మాచర్ల రింగురోడ్డు ప్రాంతానికి చెందిన టీడీపీ కార్యకర్త ఇర్లా సురేష్ కారును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఆయన రోజు మాదిరిగానే తన కారును ఇంటి సమీపంలోని గ్వేవీఆర్ హైస్కూల్ ముందు పార్కింగ్ చేశారు. అయితే సోమవారం అర్ధరాత్రి సమయంలో నల్ల కారులో వచ్చిన కొందరు వ్యక్తులు సురేష్ కారుపై పెట్రోల్ పోశారు. అనంతరం నిప్పు పెట్టడంతో ఆ కారు పూర్తిగా తగలబడింది. దీనిపై బాధితుడు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. గుంటూరు నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ల్యాబ్ సిబ్బంది సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు.

రెచ్చగొడుతున్న వైసీపీ నేతలు

ఎన్నికలు సమీపించడంతో వైసీపీ నేతలు అన్ని చోట్లా రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. కారు దహనం విషయం తెలిసి బ్రహ్మారెడ్డి మంగళవారం సురేష్‌ను పరామర్శించారు. అనంతరం బ్రహ్మారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పీఆర్కే పాలనలో బలహీన వర్గాలపై దాడులు పెరిగాయన్నారు. కారు దహనం కేసులో పక్కాగా దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని పోలీసులపై ప్రజల్లో నమ్మకం కల్పించాలన్నారు. వైసీపీ గూండాలకు టీడీపీ నేతలు బయపడే పరిస్థితి లేదన్నారు. ఆరుగురు బీసీ నేతలను హత్య చేశారన్నారు. అసైన్డ్ భూములను అధికార పార్టీ నేతలు కబ్జా చేసి అమాయకులను బలిచేశారన్నారు. నాలుగుసార్లు గెలిపిస్తే తాగునీరు కూడా ఇవ్వని చేతకాని ఎమ్మెల్యేగా పీఆర్కే నిలిచారన్నారు. 2022 డిసెంబరు 16న పోలీసుల సమక్షంలో అనేక వాహనాలతోపాటు గృహాలను వైసీపీ నేతలు ధ్వంసం చేశారన్నారు. నియోజకవర్గంలో ఎవరైతే తప్పుడు కేసులు పెట్టించారో, ఆస్తులు దోపిడీ చేశారో, అత్యుత్సాహం చూపి ప్రజలను ఇబ్బంది పెట్టారో వారందరిపై చర్యలు ఉంటాయన్నారు. వైద్యుడు అందుబాటులో లేరని చెప్పినా చికిత్స అందించలేదని మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్ అనుచరులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి సిబ్బందిపై దాడి చేశారని బ్రహ్మారెడ్డి ఆరోపించారు. బ్రహ్మారెడ్డి వెంట కుర్రి శివారెడ్డి, యెనుముల కేశవరెడ్డి, విద్యాధరణి మురళి, కొమెర దుర్గారావు, పంగులూరి అంజయ్య, పేరు వాల పుల్లారావు, మంజుల వెంకటేశ్వర్లు, కొమెర శివ, అనంతరాములు, రాజారత్నం, పెద అంజి ఉన్నారు.



బాధితుడు సురేష్‌తో బ్రహ్మారెడ్డి

ఫిష్ ఆంధ్రా.. ఫినిష్



ఇది ఫిష్ ఆంధ్రా కాదు.. టిఫిన్ ఆంధ్రా

- చతికిలపడ్డ ఫిష్ ఆంధ్రా ప్రాజెక్టు
- జిల్లాలో షాపుల లక్ష్యం 80
- ఏర్పాటైంది 36 షాపులు మాత్రమే
- లబ్ధిదారులకు అందని రాయితీ సొమ్ము

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తాజా చేపలు, రొయ్యలు విక్రయాలతో ఔత్సాహిక యువతకు ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం చేపట్టిన ఫిష్ ఆంధ్రా ప్రాజెక్టు చతికిలపడింది. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన విధంగా చేపల విక్రయం జిల్లాలో ప్రారంభం కాలేదు. షాపుల ఏర్పాటు కేవలం కాగితాలకే పరిమితమైంది. షాపుల ఏర్పాటులో అడుగు కూడా ముందుకు పడలేదు. జిల్లాలో 36 షాపులు మాత్రమే ఏర్పాటయ్యాయి. వీటికి చేపలు, రొయ్యలు సరఫరా కావడంలేదు. రాయితీ సొమ్ము అందుకున్న లబ్ధిదారులు షాపులను తెరవడం లేదు.

జిల్లాలో 80 షాపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఫిష్ ఆంధ్రా పథకం కింద షాపుల ఏర్పాటుకు యువకులు ఆసక్తి చూపడంలేదు. కేవలం 36 షాపులు మాత్రమే ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి రాయితీ రుణాలు తీసుకున్న లబ్ధిదారులు షాపుల నిర్వహణను వదిలేశారు. కొన్నిచోట్ల షాపులు మూ సి వేశారు. షాపులు కొన్ని చోట్ల బోర్డులకే పరిమిత మయ్యాయి. 30 షాపులకు ఒక హబ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇది కూడా అమలు నోచుకోలేదు. ఏర్పాటు చేసిన షాపుల్లో వారానికి నాలుగు నుంచి ఐదురోజులు చేపల విక్రయాలు జరుగుతున్నాయని మత్స్యశాఖ చెబుతుంది. ఇది అమలులో కనిపిం చడం లేదు. ఏర్పాటు చేసిన షాపునకు చేపలు, రొయ్యలు సరఫరా కావడంలేదు. మత్స్యశాఖ అవలంబిస్తున్న విధానాలు కూడా షాపుల ఏర్పాటు కాకపోవడం ఒక కారణమని చెప్పవచ్చు. రాయితీ రుణం మంజూరు చేయించి షాపు ఏర్పాటుకు అందించాల్సిన సహకారం అధికారులు నుంచి అందడం లేదన్న విమర్శలున్నాయి. షాపు ఏర్పాటుకు అవసరమైన సామాగ్రిని మత్స్యశాఖ కార్పొరేషన్ నుంచి మాత్రమే తీసుకోవాలన్న నిబంధన విధించారు. దీంతో బయట మార్కెట్ కన్నా సదరు సామాగ్రి అధిక ధరలు ఉంటున్నాయంటున్నారు. నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులో ఏర్పాటుచేసిన షాపులో చేపల విక్రయాలు జరగడంలేదు. ఫిష్ ఆంధ్రా కాస్తా టిఫిన్ ఆంధ్రాగా మారిపోయింది. ఈ షాపులో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. రెండు మూడు షాపులు మినహా మిగతా షాపుల్లో చేపల విక్రయాలు జరగుతున్న దాఖలాలు లేవు. ఏర్పాటు చేసిన షాపులకు చేపల సరఫరా చేయడంలేదంటు న్నారు. మొత్తం మీద జిల్లా ఫిష్ ఆంధ్రా అటకెక్కింది. కాగా జిల్లాలో 36 షాపులు ఏర్పాటు చేశామని, వీటిలో వారానికి నాలుగైదు రోజులు చేపల విక్రయాలు జరుగుతున్నాయని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సంజీవ్ తెలిపారు. వారం రోజుల్లో చేపల విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



నిరుపయోగంగా చేపల నిల్వ శీతల బాక్స్

కోడ్ పటిష్టంగా అమలు చేయాలి

కలెక్టర్ శివశంకర్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాలు

నరసరావుపేట రూరల్, మార్చి 19: క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుపరచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్ శివశంకర్‌ను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో కోడ్ నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల అధికారి పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లోని రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవద్దని ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పరచాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్, డీఆర్వో వినాయకం, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు

ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులపై టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి సమస్యలు, ఫిర్యాదులపై టోల్‌ఫ్రీ నెంబరు 08647-252999కు కాల్ చేయాలన్నారు.

పులిపాడులో.. ఆగని తవ్వకాలు

- అడ్డొచ్చిన అధికారులను బదిలీ చేయండి
- హుకుం జారీ చేసిన మండల ప్రజాప్రతినిధి

గురజాలటౌన్, మార్చి 19: మండల పరిధిలోని పులిపాడులో మట్టి తవ్వకాలు ఆగడం లేదు. 20 రోజులుగా గ్రామంలోని దండివాగు, చెరువు ప్రాం తాల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ నెల 10న ఆంధ్రజ్యోతి దినపత్రికలో మట్టి తవ్వకాలపై కథనం వెలువడిన మరుసటి రోజు రెవెన్యూ అధికారులు తవ్వకాలను నిలిపివేశారు. అయితే రెండు రోజుల వ్యవధిలోనే అధికార పార్టీ నేతలు తిరిగి మట్టి తవ్వకాలు ప్రారంభిం చారు. గ్రామస్తులు, అధికారులు అడ్డు తగిలితే బెదిరింపులకు దిగుతున్నారు. అధికారం కొద్ది రోజులే కదా ఉంది.. అందినంతా దోచుకుందామని అధికార పార్టీ నేతలు దౌర్జన్యానికి దిగుతున్నారు. తవ్వకాలు అడ్డుకునేందుకు వచ్చిన ఓ రెవెన్యూ అధికారిని బది లీ చేయమని మండల స్థాయి ఉన్నతాధికారికి హు కుం జారీ చేసినట్లు సమాచారం. దీనిపై సదరు ఉన్నతాధికారిని వివరణ కోరగా.. తమకు సంబంధం లేదు, పంచాయతీ కార్యదర్శిని అడగండి అని చెప్పా రు. కార్యదర్శిని వివరణ కోరగా.. తమకు సంబంధం లేదు.. రెవెన్యూ అధికారులను అడగండని చెబ్తున్నా రు. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారే కాని అక్రమాలను అడ్డుకోవడంలేదు. మైనింగ్ శాఖ అధి కారుల ఫోన్లు కూడా పనిచేయడం లేదు. అధికార పార్టీ నేతలు, అధికారులు కుమ్మక్కై మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలు

దిక్సూచి DIKSUCHI

ప్రవాళ బిత్తికలు(Coral Reefs) అనేవి సముద్రాలలో ఆయన రేఖా మండలాలలో నివసించే ప్రవాళ కీటకాలు(Coral Polyps) లేదా పగడపు పురుగులతో నిర్మితమైనవి. ఈ కీటకాలు సముద్రాలలో ఉండే కాల్షియం కార్బోనేట్‌ను గ్రహించి తమ కర్పరాల(Shells)ని నిర్మిస్తాయి.

ప్రవాళ కీటకాలు వివిధ రంగులలో ఉంటాయి. పచ్చ, పసుపు, గులాబి, తెలుపు, ఊదా మొదలైనవి. ఈ కీటకాలు గుంపులు గుంపులుగా, కాలనీలుగా నివసిస్తాయి. ఇలాంటి కాలనీలు పెరుగుతూ ఒక దానితో ఒకటి పెనవేసుకుని ప్రవాళ బిత్తికలుగా, ప్రవాళ ద్వీపాలుగా ఏర్పడతాయి. ప్రవాళ బిత్తికలు, దీవులు కేవలం ప్రవాళ కీటకాలతో ఏర్పడలేదు. ఇతర సముద్రాంతర్గత జీవులు కూడా వీటి నిర్మాణానికి తోడ్పడతాయి. అందులో ముఖ్యమైనవి సున్నపు ఆల్గే(Calcareous algae) ఫోరమినిఫెరా (Foraminifera), ఎఖైనోడర్మ్స్(Ech-inoderms) మొదలైనవి.

- వీటి ముఖ్య ఆహారం కాల్షియం కార్బోనేట్. ఇది కొరవడిన ప్రాంతాలలో వీటి పెరుగుదల కృశించిపోతుంది. కాబట్టి ఇవి ఇతర సూక్ష్మ సముద్ర జీవరాశుల నుంచి గ్రహించి తమ కర్పరాలను నిర్మిస్తాయి. ప్రవాళ కీటకాలు తమ గూళ్లు(Reef) ఉన్న చోటు నుంచి కదలవు. తమని తాకుతూ దాటివెళ్లే నీటి నుంచే ఆహారాన్ని గ్రహిస్తాయి. కాబట్టి నీటి చలనం అవసరం. మిత వేగ ప్రవాహాలు ఉన్న ప్రాంతాలలో ఇవి పెరుగుతాయి. నిలకడగా ఉన్న నీరు వీటి పెరుగుదలకు ప్రతికూలం.
- మంచి నీటి ప్రాంతాలలో ఈ కీటకాలు నివసించవు. అధిక వర్షపాతం, నదీజలాల ప్రవేశం మొదలైనవి వీటి పెరుగుదలకు ప్రతి బంధకాలు.

ప్రవాళ కీటకాలు 55 మీటర్ల కంటే ఎక్కువ లోతులో నివసించలేవు. అనేక బిత్తికలు సముద్రాలలో సుదూరంగా ఏర్పడి ఉంటాయి. ఇవి ఏర్పడటానికి అక్కడి సముద్రాంతర్గత ఉపరితలాలందు రెడ్జ్‌లుగాని, ఉబ్బెత్తు శిఖరాలు గాని ఉన్న వాటిపై ఇతర జీవరాశులు నివసించి 55 మీటర్ల లోతు వరకు వ్యాప్తి చెందినప్పుడు, ఆపై ప్రవాళ కీటకాలు సమూహ నివాసమేర్పరచుకుంటాయి. ఈ కీటకాల పెరుగుదల సముద్ర ఉపరితలం వరకే వ్యాప్తి చెందుతుంది. ఉపరితలంపైన పెరిగిన బిత్తికలలోని కీటకాలు మరణించి వీటి కర్పరాలు బిత్తికలో కలుస్తాయి.

తీరం వైపున ఉన్న కీటకాలకు ఆహార లేమి వల్ల ఇవి క్షీణించి లాగూన్లు ఏర్పడటానికి కారణమవుతున్నాయి. బిత్తికి నిర్మాణం ఒక ద్వీపం చుట్టూ ఏర్పడినట్లయితే మధ్యలో చక్రాకార లాగూన్ ఏర్పడుతుంది. దీన్ని అటోల్ అంటారు.

బిత్తికల రకాలు: ప్రవాళ బిత్తికల ఆకారం, నిర్మాణం, ఉనికిని బట్టి మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి తీరాంచల బిత్తిక(Fringing Reef), అవరోధక బిత్తిక(Barrier Reef), అటోల్(Atoll)

తీరాంచల బిత్తిక: ఇవి ఖండ తీరానికోగాని, ద్వీపానికో గాని అంటుకొని తీరపు అంచున మాత్రమే ఏర్పడతాయి. వీటి ఉపరితలం గరకుగాను, ఎగుడు దిగుడుగాను ఉంటుంది. దీని వెలుపలి అంచు సముద్రంలోనికి వాలుగా ఉంటుంది. సముద్రమట్టం వరకు పెరిగిన ప్రవాళ కీటకాలకు తీరం వైపు ఆహార సమృద్ధి లేనందు వల్ల క్రమంగా క్షీణించి లాగూన్‌లు ఏర్పడతాయి. వెలుపలి అంచున ఉన్న కీటకాలకు సముద్ర జలాల నుంచి సమృద్ధి ఆహారం లభించడం వల్ల బాగా, ఏపుగా పెరుగుతాయి. తీర ప్రాంతపు వైపున ఉన్న కీటకాలు నదీజలాల సమ్మేళనం వల్ల బురదనీటి ప్రవేశం వల్ల క్షీణించి లాగూన్ ఏర్పడటానికి కారణమవుతాయి. ఈ విధంగా ద్వీపాన్ని గాని, తీరాన్ని గాని అంటుకొని తీరంవైపు లాగూన్ గల ప్రవాళ బిత్తిక సముదాయాన్ని తీరాంచల బిత్తికలు అని పేర్కొంటారు. ఉదాహరణకు.. లక్ష దీవులు, కార్ నికోబార్ దీవులు. ఫ్లోరిడా తీరంలో, న్యూహెబ్రిడీస్ దీవులలో ఉన్నవి చెప్పుకోదగ్గవి.

ప్రవాళ బిత్తికలు

ప్రవాళ బిత్తికల పెరుగుదలకు కారణాలు

సాధారణంగా ప్రవాళ కీటకాలు ఆయన రేఖా మండల సముద్రపు నీటిలో విస్తారంగా నివసిస్తాయి. వీటి పెరుగుదలకు కొన్ని అనుకూల పరిస్థితులు అవసరం.

- ముఖ్యంగా ప్రవాళ కీటకాల పెరుగుదలకు ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ ఉండాలి. అధిక శీతల, అధిక ఉష్ణోగ్రతలలో ఈ కీటకాల పెరుగుదల కుంటుపడుతుంది.
- ఈ ప్రాణులకు అత్యవసరమైన సూర్యరశ్మి, ప్రాణ వాయువు(ఆక్సిజన్) 55 మీటర్ల లోతు వరకు మాత్రమే పుష్కలంగా ఉంటుంది. అందువల్ల వీటి పెరుగుదల 55 మీటర్ల లోతు వరకే పరిమితమై ఉంటుంది.
- ఉష్ణమండల ప్రాంత సముద్ర జలాలైన 30 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 30 డిగ్రీల దక్షిణ అక్షాంశాల మధ్య అధికంగా పెరుగుతాయి.
- స్వచ్ఛమైన ఉప్పునీరు పగడపు దిబ్బల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. అయితే మంచినీరు, అధిక లవణీయత రెండూ ప్రవాళ కీటకాల పెరుగుదలకు హానికరం.
- సాధారణంగా ప్రవాళ బిత్తికలు ఆయన రేఖా ప్రాంతాలలో(Tropical regions) ఖండాల తూర్పు తీర ప్రాంతంలోనే కనిపిస్తాయి. ఖండాల పశ్చిమ తీర ప్రాంతాలలో చల్లని నీరు పైకి ఉబికి శీతల ప్రవాహాలుగా ప్రవహిస్తున్నందున ఉష్ణోగ్రత తగ్గి వీటి పెరుగుదలకు ప్రతికూలం.
- స్వచ్ఛమైన ఉప్పునీరు ప్రవాళ కీటకాలు నివసించడానికి అవసరం. నదులు సముద్రాలలో కలిసేచోట ఒండ్రుమట్టితో నీరు బురదగా (Turbid waters) ఉండటం వల్ల నది ముఖ ద్వారాల వద్ద ప్రవాళ బిత్తికలు ఏర్పడవు.



'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/9qazLOkలో చదవండి.

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

అవరోధ బిత్తికలు: అతి పెద్దదైన, విస్తారమైన బిత్తికలలో ఇవి ముఖ్యమైనవి. తీరానికి దూరంగా ఏర్పడి లోతు విస్తీర్ణంలో తీరాంచల బిత్తికల కంటే అధికంగా ఉంటాయి. వెలుపలి వైపు ఇవి సముద్రంలోనికి ఎక్కువగా వాలు కలిగి ఉంటాయి. లాగూన్ వెడల్పు అధికంగా ఉండి, తీరం నుంచి సుమారు 10 నుంచి 180 కి.మీ. వరకు ఉంటుంది. 'ఆస్ట్రేలియా గ్రేట్ బారియర్ రీఫ్' దీనికి మంచి ఉదాహరణ. ఈ బిత్తిక ఆస్ట్రేలియా ఖండపు తూర్పున క్వీన్లాండ్ తీరాన 1900 కి.మీ. పొడవు, 160 కి.మీ. వెడల్పున వ్యాపించి ఉంది. ఇది ఉత్తరాన తీరం నుంచి 128 కి.మీ. దూరం వరకు, దక్షిణాన 11 కి.మీ. దూరం వరకు విస్తరించి లాగూన్‌తో కూడి ఉంది. తీరానికి బిత్తికకు మధ్య సముద్రం ప్రశాంతంగా ఎక్కువ అలలు లేకుండా జలక్రీడలకు అనువుగా ఉంటుంది.

అటోల్: అటోల్ బిత్తికలో చక్రాకారంలో గాని, గుర్రపు నాళపు ఆకారంలో గాని ఉండి మధ్యలో లాగూన్ కలిగి ఉంటుంది. కొన్నింటిలో ఈ లాగూన్ మధ్య చిన్న ద్వీపం ఏర్పడుతుంది. చక్రాకారంగా ఉన్న బిత్తిక చుట్టూ కొన్ని చోట్ల ఖాళీలు ఏర్పడి, వాటికి వెలుపలి సముద్రంతో సంబంధం ఉంటుంది. నిర్దిష్టంగా ఏర్పడిన అటోల్‌కు చెందిన లాగూన్ మధ్యన ద్వీపం ఉండదు. అటోల్లు అధికం పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడ్డాయి. ఉదా:- తూర్పుఫిజీ అటోల్, పశ్చిమ కారోలినలోని ట్రుక్ అటోల్ మొదలైనవి. మాల్దీవ్ ద్వీపాలలో కూడా అనేక దీవులు అటోల్ ఆకారంలో ఉన్నవే.

భారతదేశం - పగడపు దిబ్బల విస్తరణ: భారతదేశంలోని పగడపు దిబ్బలు గల్ఫ్ ఆఫ్ కచ్(గుజరాత్), గల్ఫ్ ఆఫ్ మన్నార్(తమిళనాడు), పాక్ అఖాతం, అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్ దీవులతో సహా చాలా ప్రాంతాల్లో కనిపిస్తాయి. వాయువ్య ప్రాంతంలోని గల్ఫ్ ఆఫ్ కచ్ ప్రపంచంలో అత్యంత ఉత్తరంగా ఉన్న పగడపు దిబ్బలుగా పేర్కొంటారు. పగడపు దిబ్బల చిన్న చిన్న ముక్కలు రత్నగిరి(మహారాష్ట్ర), మాల్వాన్(మహారాష్ట్ర), రెడి(దక్షిణ బొంబాయి)లో, మంగళూరు(కర్ణాటక)కు పశ్చిమాన ఉన్న గవేషాని బ్యాంకు వద్ద కూడా కనిపిస్తాయి.



వి.వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

SCHOLARSHIP ALERT

Kotak Suraksha Scholarship Program

Description: Kotak Securities Limited (KSL) invites applications from students studying in Classes 9 to 12 or pursuing general/professional graduation.
Eligibility: Open to PwD applicants currently studying in Classes 9 to 12 or pursuing general/professional graduation in India. Applicants must have secured at least 55% marks in their previous academic year.

PAN India applicants are eligible. Annual family income of the applicants must not exceed INR 3,20,000.
Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year *Last Date:* 30-04-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/KSSP1

Bhumi Fellowship Program in India

Description: Bhumi Fellowship Program in India 2024-26 is a 2-year, full-time paid program designed to develop future leaders in education. It provides young graduates with hands-on training and experience in teaching and transforming schools in India.
Eligibility: Open to individuals aged 20-30 with a degree in Social Work, Education, or Engineering, who are willing to commit to a two-year full-time fellowship and are based in Chennai or willing to relocate.
Prizes & Rewards: A monthly grant of 25,500 and other benefits
Last Date to Apply: 30-05-2024
Application mode: Online Applications Only
Short Url: www.b4s.in/aj/THBF5

University of Bath GREAT Scholarship, India 2024

Description: University of Bath GREAT Scholarship, India 2024 is an opportunity offered by the University of Bath in collaboration with the British Council's Study UK campaign. Under this programme, students from 15 countries including India will receive financial support to pursue postgraduate study in the UK.
Eligibility: Open to Indian citizens with a valid passport who hold an offer for a full-time, postgraduate taught master's course at the University of Bath. Candidates must be classified as international students for tuition fee purposes and demonstrate an outstanding academic background.
Prizes & Rewards: A partial tuition fee of £10,000 for one year of study
Last Date to Apply: 20-05-2024
Application mode: Online
Short Url: www.b4s.in/aj/UBG01

buddy4study.com

కలినరీ ఆర్ట్స్‌లో బీబీఏ, ఎంబీఏ

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(ఐసీఐ)- బీబీఏ, ఎంబీఏ ప్రోగ్రాములలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటికి అమర్‌కంటక్ లోని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లు ఉన్నాయి. సీయూఈటీ(యూజీ/పీజీ) స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

బీబీఏ (కలినరీ ఆర్ట్స్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 120 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(యూజీ) 2024 స్కోర్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎంబీఏ(కలినరీ ఆర్ట్స్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.
- **ఎంపిక:** సీయూఈటీ(పీజీ) 2024 స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(పీజీ) 2024 స్కోర్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 25
- **ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(యూజీ/పీజీ) తేదీ:** మే 26
- **వెబ్‌సైట్:** www.icitirupati.in

నవ్య | చిత్రజ్యోతి



గ్లాస్ అంటే సైజు కాదు... సైన్యం

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా పవన్‌కల్యాణ్ నటిస్తున్నారు. 'భగత్ బ్లేజ్' పేరుతో ఈ సినిమా టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సినిమాలో పంచ్ డైలాగులు పవర్‌ఫుల్‌గా ఉన్నాయి.. తన రేంజ్‌ను విమర్శించే వారికి ఘాటుగా సమాధానం ఇస్తూ 'గాజు పగిలే కొద్దీ పదునెక్కుద్ది.. గ్లాస్ అంటే సైజు కాదు.. సైన్యం.. కనిపించని సైన్యం' అంటూ పవన్‌కల్యాణ్ కౌంటర్ ఇవ్వడం గూస్ బంప్స్ తెప్పించింది. ఈ టీజర్‌లో హీరోయిన్ శ్రీలీల కూడా కనిపించారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఆకట్టుకొనే బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో పవన్‌కల్యాణ్ క్యారెక్టర్‌కు ఎలివేట్ చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆయనంక బోస్, స్ర్కీన్‌ప్లే, కె.దశరథ్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.



వేదం కాంబినేషన్‌లో..

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చారు అనుష్క శెట్టి. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 50వ చిత్రం అధికారికంగా ఖరారైంది. ప్రయోగాత్మక చిత్రాలు తీసే క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ కృష్ణ రెడ్డి, రాజీవ్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రానికి 'ఘాటి' అనే టైటిల్‌ను ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. చీరతో ముఖాన్ని కప్పి ఎడారిలో ఒంటరి బాటసారిగా సాగుతున్న అనుష్కను ఇందులో చూపించారు. ఓ మహిళ.. తనకు జరిగిన అన్యాయంపై పోరాడి బయటపడే కథగా ఈ సినిమా తెరకెక్కనుంది. కాగా, క్రిష్ దర్శకత్వంలో దాదాపు 14 ఏళ్ల తర్వాత అనుష్క నటిస్తుండటం విశేషం. వీరిద్దరి కలయికలో వచ్చిన 'వేదం' విమర్శకుల ప్రశంసలతో పాటు క్లాసికల్ హిట్ స్టేటస్‌ను సంపాదించుకుంది. అందులో వేశ్యగా నటించిన అనుష్క, ఈ చిత్రంలోనూ అదే పాత్ర పోషించనున్నారని టాక్ వినిపిస్తోంది.

జపాన్‌కు తీసుకొస్తా





జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా దర్శకధీరుడు రాజమౌళి రూపొందించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం దేశవిదేశాల్లో విజయం సాధించింది. అలాగే ఇటీవల జరిగిన ఆస్కార్ వేడుకల సందర్భంగా గత ఏడాది ఆస్కార్ వేదికపై 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం సృష్టించిన సందర్భాన్నా అందరూ మరోసారి గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా జపాన్‌లో కూడా విడుదలై విజయం సాధించింది. ఈ విజయాన్ని అక్కడి ప్రేక్షకులతో కలసి ఆస్వాదించడానికి రాజమౌళి ఇటీవలే జపాన్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ప్రేక్షకులతో మాట్లాడుతూ "నేను దర్శకత్వం వహించే నెక్ట్ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. నటీనటుల ఎంపిక ఇంకా ఓ కొలిక్కి రాలేదు. కేవలం కథానాయకుడు మాత్రమే ఖరారు అయ్యారు. ఆయన పేరు మహేశ్‌బాబు. చాలా అందంగా ఉంటారు. త్వరలోనే ఈ సినిమాను మొదలుపెడ్తాను. సినిమా రిలీజ్ సమయానికి మహేశ్‌ను కూడా జపాన్ తీసుకువచ్చి మీకందరికీ పరిచయం చేస్తాను. మహేశ్‌ను కూడా కచ్చితంగా మీరందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

టెనెంట్ సందేశం



'పొలిమేర 2' చిత్రం ఘన విజయం తర్వాత సత్యం రాజేశ్ కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు చక్కటి స్పందన వచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు థ్రిల్ చేసే అంశాలతో ఈ చిత్రం రూపొందిస్తున్నామని దర్శకుడు తెలిపారు. 'ఈ తరం మహిళలు ఎంత జాగ్రత్తగా మెలగాలో ఈ చిత్రంలో చూపించబోతున్నాం, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. ఏప్రిల్ మూడో వారంలో 'టెనెంట్'ను విడుదల చేస్తాం' అని నిర్మాత తెలిపారు. మేఘా చౌదరి, చందన పయావుల కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్. సినిమాటోగ్రఫీ: జెమిన్ జోమ్

స్వేచ్ఛకు స్ఫూర్తి



సాయికుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'మెర్సీ కిల్లింగ్'. సూరపల్లి వెంకట రమణ దర్శకత్వంలో మాదవి తాలబత్తుల నిర్మిస్తున్నారు. ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను హీరో ఆకాశ్ పూరి చేతుల మీదుగా విడుదల చేశారు. కొత్త తరహా కాన్సెప్ట్‌తో తెరకెక్కిన 'మెర్సీ కిల్లింగ్' ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 స్ఫూర్తితో ఈ సినిమా కథ రూపొందించినట్లు దర్శకుడు తెలిపారు. స్వేచ్ఛ అనే అనాథ బాలిక న్యాయం కోసం జరిపిన పోరాటం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నిర్మాత చెప్పారు. సంగీతం: ఎం. ఎల్ రాజా. సినిమాటోగ్రఫీ: అమర్ జి.



దర్శక ధీరుడి సమర్పణలో...

దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ నిర్మాతగా మారుతున్నారు. ప్రముఖ ఆర్కా మీడియా వర్క్స్ సంస్థ అధినేతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనితో కలసి కార్తికేయ రెండు క్రేజీ ప్రాజెక్ట్‌ను రూపొందించనున్నారు. పాన్ ఇండియా డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి ఈ చిత్రాలకు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. సినిమా, సినిమాకు ఎంచుకునే పాత్రల్లో వైవిధ్యాన్ని ప్రదర్శించే మళయాళ నటుడు, 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్ ఈ రెండు చిత్రాల్లోనూ నటిస్తుండటం విశేషం. కార్తికేయ ఈ మధ్య తెలుగులో డిస్ట్రిబ్యూటర్‌గా విడుదల చేసిన 'ప్రేమలు' చిత్రానికి ఫహాద్ ఫాజిల్ కూడా ఓ నిర్మాత అనే సంగతి తెలిసిందే. ఈ రెండు చిత్రాల్లో ఒకటి ఫ్రెండ్‌షిప్ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. దీనికి 'ఆక్సిజన్' అనే టైటిల్ ఖరారు చేశారు. నూతన దర్శకుడు సిద్ధార్థ్ నాదెళ్ల దర్శకుడు. మరో చిత్రం ఫ్యాంటసీ కథాంశంతో రూపొందుతోంది. ఈ చిత్రం టైటిల్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ ఏలేటి దర్శకుడు. ఈ రెండు చిత్రాలకు వేటికవే భిన్నంగా, కంటెంట్ బేస్డ్‌గా తెరకెక్కనున్నాయి. ఈ సినిమాలను ప్రకటించిన సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ "డిస్ట్రిబ్యూటర్‌గా నా తొలి చిత్రం 'ప్రేమలు' ద్వారా నాకు విజయాన్ని అందించి నాపై మీకున్న అపరిమితమైన ప్రేమను తెలియజేశారు. దీంతో మంచి చిత్రాలకు భాషాపరమైన భేదాలుండవనే నమ్మకం నాలో మరింతగా పెరిగింది. ఈ రెండు చిత్రాల్లో నటిస్తున్న ఫహాద్ ఫాజిల్ బహుముఖ ప్రజ్ఞకు ప్రతిరూపం, నేనెంతగానో ఆరాధించే వ్యక్తి" అని అన్నారు.

సిద్ధమైన హనీ-బన్నీ



హాలీవుడ్ వెబ్ సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌లో సమంత, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఒరిజినల్ వెర్షన్‌కు రుస్సో బ్రదర్స్ దర్శకత్వం వహించగా, 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్‌తో పాపులర్ అయిన దర్శక ద్వయం రాజ్, డీకే ఇండియన్ వెర్షన్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తయినా, ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ అవుతుందనే విషయంలో ఇంతవరకూ ఎటువంటి అప్‌డేట్ రాలేదు. మేకర్స్ మంగళవారం ఈ సిరీస్ పోస్టర్‌తో పాటు టైటిల్‌ను రివీల్ చేశారు. 'హనీ-బన్నీ' పేరుని ఖరారు చేశారు. ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవనుంది. డేట్ మాత్రం ఇంకా ఫిక్స్ చేయలేదు. 1990ల నేపథ్యంలో సాగనున్న ఈ సిరీస్ అద్భుతమైన ప్రేమ కథతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్. దర్శక ద్వయం రాజ్, డీకే రూపొందించిన 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్‌లో నెగెటివ్ టచ్ ఉన్న పాత్రను పోషించిన సమంత 'హనీ-బన్నీ సిరీస్‌కోసం మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఈ సిరీస్‌లో కేకే మీనన్, సిమ్రాన్, సోహమ్ మజుందార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఏడు గెటప్పుల్లో మంచు లక్ష్మి



లక్ష్మీ మంచు ప్రధాన పాత్ర పోషించిన సోషియో ఫాంటసీ 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు. ఎం.ఎస్.కే నిర్మాత. ఈ పీరియాడిక్ డ్రామా తెలుగుతో పాటు పలు భాషల్లో విడుదలవుతోంది. తెలంగాణ ఎఫ్.డి.సి చైర్మన్ ఎస్. గిరిధర్ చేతుల మీదుగా 'ఆదిపర్వం' తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మంచు మాట్లాడుతూ 'పోస్టర్ చూస్తుంటే 'నేను ఇన్ని పాత్రలు చేశానా?' అనిపిస్తోంది. అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది' అన్నారు. 'ఈ చిత్రానికి బలం, బలగం మంచు లక్ష్మీ. ఆమె నటించకపోతే ఈ సినిమా లేదు. ఇందులో ఆమె ఏడు రకాల గెటప్స్ వేశారు. తన నట విశ్వరూపం చూస్తాం' అని దర్శకుడు చెప్పారు. శివ కంఠంనేని, ఎస్తర్ నోరోనా కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: మాధవ్, సంజీవ్. సినిమాటోగ్రఫీ: ఎస్ఎన్ హరీశ్

కామెడీతో వేడి పుట్టిస్తాం



సుహాస్ హీరోగా దిల్ రాజు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. 'అందరూ మెచ్చే వినోదం ప్రారంభమవుతుంది. మీ క్యాలెండర్‌లో మే 24ని గుర్తు పెట్టుకోండి. మేం అద్భుతమైన కామెడీతో వేడి పుట్టించడానికి సిద్ధంగా ఉన్నాం' అని హీరో సుహాస్ వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఇందులో సుహాస్‌కి జతగా సంకీర్తన విపిన్ నటిస్తున్నారు. 'సలార్' చిత్రానికి డైలాగ్ రైటర్‌గా పని చేసిన సందీప్‌రెడ్డి బండ్ల ఈ సినిమాకు దర్శకుడు. మే 24న విడుదలయ్యే ఈ సినిమా టైటిల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు చెప్పారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆ పోస్టర్‌ను చూస్తుంటే ఫ్యామిలీ ఎమోషన్స్ కలిగిన ఓ ఫన్నీ కోర్టు డ్రామా చిత్రమని అర్థమవుతుంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, మురళీశర్మ, గోపరాజు, రఘుబాబు, పృథ్వీ, శివన్నారాయణ, రూపలక్ష్మీ, విజయలక్ష్మి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత. సమర్పణ: శిరీష్.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/m6Ot446 లో చదవండి.


తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతిని కాపాడుకోవటం అందరి బాధ్యత

- మూడు ముక్కల ఆటతో విధ్వంసం తప్ప వికాసం లేదు
- 1554వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 19: రాష్ట్ర ఆదాయ వనరు అమరావతిని కాపాడుకోవటం అందరి బాధ్యత అని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు విన్నవించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 1554వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, సీఎం జగన్‌రెడ్డి ప్రతిపాదించిన మూడు రాజధానులతో విధ్వంసం తప్పితే వికాసం ఉండదన్నారు. అమరావతి రాజధాని రాష్ట్ర సంపద అని స్పష్టం చేశారు. అది తెలిసి కూడా అమరావతిని నాశనం చేయాలను కోవటం సీఎం జగన్‌రెడ్డి బుద్ధి తక్కువ పని అని పేర్కొన్నారు.ఉన్నత న్యాయస్థానం కూడా అమరావతిని అభివృద్ధి చేయాలని తీర్పునిచ్చిన సంగతి మర్చిపోవద్దని రైతులు హితవు పలికారు. అమరావతిని నాశనం చేసే ఏ పనినైనా అడ్డుకొని తీరతామన్నారు. రాజధానిని నాశనం చేయాలని గతంలో అనేక ప్రయత్నాలు వైసీపీ ప్రభుత్వం చేసిందన్నారు. ఆ చర్యలను నిలిపివేయాలని హితవుపలికారు. లేదంటే పాలకులకు తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. జై ఆంధ్రప్రదేశ్, బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. తుళ్ళూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి, ఉద్దండ్రాయునిపాలెం, అనంతవరం నెక్కల్లు తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

టీడీపీ దిమ్మెలకే తెలుపు రంగు


టీడీపీ జెండా దిమ్మెకు వేసిన తెలుపు రంగు

కారంపూడి, మార్చి 19: అధికారులు సైతం పక్షపాతం చూపిస్తున్నారోమో అనిపిస్తోంది. మండలంలోని ఇనుపరాజుపల్లెల్లో వైసీపీ రంగులు ఉన్న జెండా దిమ్మెలు, విద్యుత్ పోల్స్‌ను వదిలేసి కేవలం టీడీపీ దిమ్మెలకే తెలుగు రంగులను పూశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. అధికారులు వైసీపీకి పక్షపాతం వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.


వైసీపీ రంగులున్న దిమ్మెలకు వేయని తెలుపు రంగు

సురక్ష పేరున.. ప్రచారం

- మే నెల వరకు క్యాంపులు నిర్వహించాలని పైస్థాయిలో ఆదేశాలు
- కోడ్ వచ్చినా సచివాలయాలు, ఆర్‌బీకేలకు ఆగని జగన్ పత్రిక
- తీవ్ర ఒత్తిడికి గురౌతున్న సచివాలయాల సెక్రెటరీలు

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ డే(మే 13వ తేదీ) ముగిసేంత వరకు ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించేందుకు సంబంధిత ట్రస్టు నుంచి నిత్యం ఆదేశాలు వెలువడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా సచివాలయాల సెక్రెటరీలకు ట్రస్టు అధికారులు ఫోన్లు చేస్తూ మీ సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించాలని ఆదేశిస్తున్నారు. దీనిపై సెక్రెటరీలు అభ్యంతరం లేవనెత్తుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆరోగ్య సురక్ష శిబిరాలకు సంబంధించి వైద్య పరీక్షలకు వెళ్లినప్పుడు జగన్ బొమ్మతో ఉన్న ఒక సంచి, ఫైలు, మెడికల్ కేస్‌షీట్‌ని ఇస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ప్రస్తుత తరుణంలో దీని వలన తమకు ఇబ్బంది కలుగుతుందని చెబుతున్నా వాటి వరకు వేరే మెటీరియల్ పంపిస్తామని, ఎట్టిపరిస్థితుల్లో క్యాంపులు నిర్వహించాల్సిందేనని తమకు ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు అందుతున్నాయని సెక్రెటరీలు చెబుతున్నారు.

వాస్తవానికి డిసెంబరు/జనవరి నెలల్లోనే జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతీ సచివాలయం పరిధిలో వైసీపీ ప్రభుత్వం క్యాంపులు నిర్వహించింది. ఈ క్యాంపులు ముఖ్యఉద్దేశ్యం వైద్య పరీక్షలు నిర్వహించి ఎవరికైనా ఆరోగ్య సమస్యలుంటే సంబంధిత ఆస్పత్రికి లింకు చేసి వైద్యం చేయించడమే. ఆ పనిని ఇప్పటికే పూర్తిచేశారు. ఎన్నికల కోడ్ మరికొద్ది రోజుల్లో అమలులోకి వస్తుందనగా మళ్లీ ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత శనివారం నుంచి కోడ్ అమలులోకి వచ్చిన దృష్ట్యా ఈ శిబిరాల నిర్వహణని నిలిపేయాలి. ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకొంటారు. అయినప్పటికీ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఆరోగ్య సురక్ష క్యాంపుల పేరుతో వైసీపీ ప్రభుత్వం కొత్త డ్రామా ఆడుతున్నది. ఈ క్యాంపుల నిర్వహణని నిలిపేయాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమవౌతున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

సీఎం జగన్ తన పత్రిక సర్క్యులేషన్‌ని పెంచుకొనేందుకు జిల్లాలోని ప్రతీ ఒక్క గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ప్రభుత్వ నిధులతో వాటిని గత కొన్ని ఏళ్లుగా అంటగడుతున్నారు. అలానే గ్రామ/వార్డు సచివాలయాలు, ఆర్‌బీకేలు వంటి వాటికి కూడా రెండేసి పేపర్లను వేయిస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో 25 వేల వరకు జగన్ పత్రిక కాపీలను ప్రభుత్వ ఉద్యోగులు/కార్యాలయాలకు ఇస్తున్నారు. జగన్ పత్రికపై స్పష్టంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటో ఉంటుంది. అలాంటప్పుడు ఆ పత్రికని ప్రభుత్వ కార్యాలయాలకు వేయించడాన్ని అధికారులు నిలిపేయాలి. అలానే సిబ్బందికి కూడా నిలుపుదల చేయించాలి. ఈ విషయంలోనూ అధికారులు చర్యలు తీసుకోకపోతుండటంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి.

గుంటుపల్లి మృతి టీడీపీకి తీరనిలోటు : యరపతినేని

- చంద్రబాబు, లోకేశ్ ఫోన్‌లో పరామర్శ



టీడీపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఇన్‌సెట్లో గుంటుపల్లి (ఫైల్)

దాచేపల్లి, మార్చి 19: గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి పట్టణానికి చెందిన టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు ఆకస్మిక మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం గుంటుపలి నర్సరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, ఆలపాటి రాజా, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జ్‌లు జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవింద్‌బాబు, ఇతర ప్రముఖులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, వివిధ హోదాల్లో వున్న నాయకులు గుంటుపల్లి కుటుంబసభ్యులను నేరుగా, ఫోన్ ద్వారా పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గుంటుపల్లి టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక కార్యకర్త నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండుసార్లు, నవ్యాంధ్రప్రదేశ్‌లో ఒకసారి రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. యరపతినేని శ్రీనివాసరావుకు ఆత్మీయుడిగా ఆయనతో కలిసి పనిచేశారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు పార్టీ పరంగా, తన వ్యక్తిగతంగా సహాయ సహకారాలు ఎల్లప్పుడు వుంటాయని భరోసా ఇచ్చారు. గురజాల, మాచర్ల, నరసరావుపేట, పలు నియోజకవర్గాల నుం,ఇ సామాన్య కార్యకర్తలు గుంటుపల్లి భౌతిక దేహానికి నివాళులు అర్పించారు. గురువారం ఉదయం అంత్యక్రియలు జరుగనున్నాయని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. యరపతినేనితో పాటు డాక్టర్ యరపతినేని రమేష్‌బాబు, యరపతినేని తనయుడు యరపతినేని నిఖిల్, తదితరులున్నారు.

గుంటుపల్లి సేవలు ఎనలేనివి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, మార్చి 19: పల్నాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గుంటుపల్లి నాగేశ్వరరావు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. గుంటుపల్లి మృతిచెందారన్న వార్త తనని తీవ్రంగా కలచివేసిందని, సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన సేవలు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు.

గుంటుపల్లి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి: జీవీ

నరసరావుపేట టౌన్, మార్చి 19: బీసీ సీనియర్ నాయకుడు గుంటుపల్లి నాగేశ్వరరావు మరణం పార్టీకి తీరని లోటని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్న సమయంలో ఇలా జరగడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఒక గొప్ప సహచరుడిని కోల్పోయామని అన్నారు. నాగేశ్వరరావు మృతి పట్ల సంతాపాని తెలియజేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎన్నికల కోడ్ అంటూ అధికారుల విధ్వంసం

- పసుపు రంగు ఉందంటూ సిమెంటు బెంచీలు ధ్వంసం


యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో అధికారులు ధ్వంసం చేసిన బెంచీలు

యడ్లపాడు, మార్చి 19: దాతలు ప్రజోపయోగం నిమిత్తం కూడళ్ళలో ఏర్పాటుచేసిన సిమెంటు బెంచీలను ఎన్నికల కోడ్ పేరుతో అధికారులు ధ్వంసం చేశారు. కనీసం దాతలకుగాని, స్థానికులకు గాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ధ్వంసం చేయడం విమర్శలకు దారి తీసింది. కేవలం బెంచీలకు పసుపు రంగు వేసి ఉందన్న సాకుతో ఇలా ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తమకు చెప్పినా పట్టలు చుట్టడమో లేదా రంగులు మార్చడమో చేసి ఉండేవారమని దాతలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం వేసిన బెంచీలను తహసీల్దార్ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి ధ్వంసం చేశారని ఆరోపించారు.

వారం నుంచి.. వెక్కిళ్లే..

- కాకుమానులో నీటికి కటకట
- ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి


ఆటోల్లో నుంచి నీటిని క్యాన్‌లోకి పట్టుకుంటున్న స్థానికులు


రిక్షాలపై క్యాన్‌లు, బిందెలతో నీటిని తీసుకు వెళ్తున్న చిన్నారులు

కాకుమాను, మార్చి 19: మండల కేంద్రమైన కాకుమానులో తాగు నీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. మేజర్ పంచాయతీ కాకుమానులో 10 వేలకు పైగా జనాభా ఉంటున్నారు. గత ఇరవై రోజుల నుంచి గ్రామంలో తాగు నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. వీర్లంకమ్మ గుడి బజారు, ఎస్సీ కాలనీలో నీరు సరఫరా చేసి ఎనిమిది రోజులైంది. గ్రామంలో పడమర చెరువు నుంచి పంచాయతీ అధికారులు గ్రామంలో నీటిని సరఫరా చేసేవారు. ఏటా వేసవి ఎద్దడిని దృష్ట్యా మార్చి నెలలో చెరువులను నీటితో నింపేవారు. ఈ ఏడాది ఫిబ్రవరి రెండవ వారంలోనే కొమ్మమూరు కాలువకు నీటి సరఫరా నిలిచింది. కొమ్మూరు, అప్పాపురం, పెద్దివారిపాలెం వంటి గ్రామాల్లో వరద నీటిని చెరువులో నింపారు. కాకుమానులో అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ ఆ ప్రయత్నం చేయలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాకుమాను పడమర చెరువులో ఫిబ్రవరి 20వ తేదీ నాటికే నీరు పూర్తిగా అడుగంటింది. దానిని దృష్టిలో ఉంచుకుని పెద్దివారిపాలెం శివారులో ఉన్న అక్కుల చెరువులో నీటిని గ్రామంలో సరఫరా చేశారు. ఆ చెరువులో కూడా నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఇటువంటి పరిస్థితిలో గ్రామంలో అధికారులు చేసేదేమి లేక మిన్నకుండిపోయారు. కాకుమానులో తాగునీటి సరఫరా కోసం అప్పాపురం మీదగా ప్రవహిస్తున్న కొమ్మమూరు కాలువ వద్ద పైలెట్ ప్రాజెక్టు ఆధారం. పైలెట్ ప్రాజెక్టుకు కరెంటు బకాయి ఉండడంతో ఆ ప్రాజెక్టు కూడా మూతపడింది. అక్కుల చెరువు నుంచి సుమారు ఐదు కిలోమీటర్‌ల దూరం నుంచి గ్రామానికి నీటి సరఫరా అవుతుంది. కొంత మంది రైతులు పంట ఉత్పత్తులు రక్షించుకునేందుకు పైప్‌లను ధ్వంసం చేయడంతో గ్రామానికి నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. కొంతమంది పీపాను రూ.600 నుంచి రూ.1000 వరకు కొనుగోలు చేసి అవసరాలకు వాడుకోవాల్సి వస్తుంది. పేదలు, కూలీలు అంత నగదు చెల్లించే పరిస్థితి లేక నానా తిప్పలు పడుతున్నారు. వయోభారంతో బాధ పడేవారు నగరాల్లో ఉన్న వారి బంధువులు ఇళ్లకు వెళుతున్నారు. వారం నుంచి గ్రామంలో నీటి సరఫనా లేకపోవడంతో మంగళవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేదెలకు నీరు లేక కిలోమీటర్ దూరంలో ఉన్న అప్పాపురం చానల్ వద్దకు నీటికి వదులుతున్నారు. తాము వాడుకోవడానికి నీరు లేక పశువులకు నీరు అందించలేక పశు పోషకుల బాధలు వర్ణనాతీతం.


పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు వద్ద తమగోడు వెళ్లబోసుకుంటున్న బీసీ కాలనీ వాసులు


పచ్చగా రంగుమారి ఉన్న నీటిని తాగుతున్న పశువులు


కుంటల్లో ఉన్న నీటిని తోడుకుంటున్న కాకుమాను ఎస్సీ కాలనీ వాసులు

గిరిజనులపై వైసీపీ అరాచక పాలన

- టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్


గుంటూరు, మార్చి 19: గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఆదివాసీ గిరిజనులు వైసీపీ పాలనలో తీవ్ర అన్యాయానికి గురయ్యారని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలుగుదేశం ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు అందిస్తే జగన్ రెడ్డి ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని ధ్వజమెత్తారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులను సైతం దారి మళ్లించిన గిరిజన ద్రోహి జగన్ రెడ్డి అని విమర్శించారు. నాడు చంద్రబాబు నాయుడు ఆదివాసీలు ఉద్యోగ-అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి చూసి ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా జీవీవీకె స్కూల్స్‌ను ఏర్పాటు చేసి గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారన్నారు. జగన్ రెడ్డి వాటిని జీపీఎస్ స్కూల్స్‌గా మార్చి అనేక స్కూల్స్ మూసివేయించాడన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం హెల్త్ అసిస్టెంట్లను టీడీపీ ప్రభుత్వం నియమించిందన్న కక్షతో వారిని తొలగించి కొన్ని వేలమంది పిల్లల మరణాలకు కారణమయ్యిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేయబడిన అన్ని పథకాలను రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో పునరుద్ధరిస్తామని చెప్పారు.

ప్రజాగళం భద్రత వైఫల్యంపై విచారణ చేపట్టాలి: కన్నా

సత్తెనపల్లి మార్చి 19: ప్రజాగళం సభ భద్రత వైఫల్యంపై విచారణ చేపట్టాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాఫిక్ జామ్ వలన వేలాదిమంది సభకు రాలేక పోయారని అన్నారు. సభకు వచ్చిన లక్షలాదిమంది జన తోసుకువస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూశారని కన్నా అన్నారు. సభలో పోల్స్ ఎక్కిన వారిని దిగాలని స్థానిక పోలీసులు నియంత్రించాల్సి ఉండగా స్వయంగా ప్రధాన మంత్రి చెప్పారంటే పోలీసుల వైఖరి అర్థమవుతుందని కన్నా అన్నారు. ఈ ప్రభుత్వంలో పనిచేస్తున్న కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని అన్నారు. ప్రదాని భద్రత, ట్రాఫిక్ నియంత్రణ అంశాలను పోలీసుబాసులు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమీషన్ సమగ్ర విచారణ జరపాలని అన్నారు.

ఎన్నికల దారికి శ్రీకారం

- అధికారుల ఫిర్యాదుతో ఆగిన పనులు


బెల్లంకొండ - వన్నాయపాలెం మధ్యలో వేసిన రహదారి

బెల్లంకొండ, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయినా కోడ్ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. తాయిలాల పంపిణీలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతూ ఓటర్లను వలలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. బెల్లంకొండ - వన్నాయపాలెం గ్రామాల మధ్య పంట పొలాలకు వెళ్లే రహదారిని ఏర్పాటు చేస్తాం.. మీరందరూ ఓటు వేయాలని అధికార పార్టీనేతలు రోడ్డు వేసేందుకు పనులు మొదలుపెట్టారు. ముఖ్య నేతకు చెందిన ఎక్స్‌కవేటర్ సాయంతో మంగళవారం పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు కొందరు ఆర్‌వో శ్రీరాములకు ఫిర్యాదు చేశారు. ఆయన పనులను ఆపించేశారు.

తాయిలాలు ఆశించకుండా ఓటు వేయాలి

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ


కన్నెగంటి పాపారావు ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ తదితరులు

బాపట్లరూరల్, మార్చి 19: తాయిలాలు ఆశించకుండా నేటి యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని లోక్ సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ తెలిపారు. కన్నెగంటి పాపారావు ఆత్మకథ విత్తనంలో విశ్వం పుస్తకావిష్కరణ సభ మంగళవారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ యువత బంగారు భవిష్యత్తు కోసం ఓటు అనే ఆయుధంతో మార్గం వేసుకోవచ్చని వివరించారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరు ఓటు వేయాలని సూచించారు. పత్తిసాగులో విప్లవమార్పు తీసుకొచ్చిన వ్యక్తి కన్నెగంటి పాపారావు అన్నారు. వేలాదమంది జీవితాలలో వెలుగు నింపిన వ్యక్తిగా ఒక రైతుగా, సామాజికకార్యకర్తగా, మంచిపౌరుడిగా వెలుగొందిన వ్యక్తన్నారు. సమాజానికి ఏది అవసరమో దాని కోసం రైతులను ప్రభుత్వాలు ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచలో ఎక్కడా జరగనటువంటి అన్యాయం మనదేశంలోని రైతులకు జరుగుతున్నదన్నారు.

నరసరావుపేట మార్గంలో పలు రైళ్ల రద్దు

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బుగ్గనపల్లి - బేతంచర్ల మధ్యన రెండో రైలు మార్గం పనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నెంబరు.17253 గుంటూరు - సికింద్రాబాద్, నెంబరు.17254 సికింద్రాబాద్ - గుంటూరు, ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు నెంబరు.17228 గుంటూరు - డోన్, ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నెంబరు 17227 డోన్ - గుంటూరు రైళ్లను రద్దు చేశామన్నారు. నెంబరు.22831 హౌరా - శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 27న, నెంబరు 22832 శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం - హౌరా, ఈ నెల 29న నెంబరు.22883 పూరీ - యశ్వంత్‌పూర్ రైళ్లను నంద్యాల, యర్రగుంట్ల మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ మూడు రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరిస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

మాచవరం, మార్చి19: మండలంలోని తురకపాలెం గ్రామ సచివాలయం కార్యదర్శికి మంగళవారం ఎంపీడీవో బి.సురేష్ షోకాజ్ నోటీసు జారీచేశారు. ఆంధ్రజ్యోతి జిల్లా పత్రికలో కోడ్ ఉల్లంఘన.. సచివాలయంలో వైసీపీ నాయకుల సమావేశం అనే శీర్షికన వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనికి స్పందించిన సచివాలయ కార్యదర్శి రామరాజుకి షోకాజ్ నోటీసు జారీచేశారు. ఈ నెల 17వ తేదీ రాత్రి గ్రామ సచివాలయంలో వైసీపీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ముస్లింల రిజర్వేషన్‌పై సమావేశం నిర్వహించి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో అధికారులు స్పందించి సదరు సచివాలయ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీచేసి సదరు విషయంపై రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలంటూ ఆదేశించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

1,15,322 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,19,996 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,15,322 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 88,720 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోద య్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు.5	10000	17000
273	10000	19000
341	9000	18000
4884	10500	16800
సూపర్ 10	11500	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	10000	19500
దేవనూరు డీలక్స్	10000	18000
తెల్లకాయలు	5000	12500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేయాలి

● టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 19 : రాష్ట్రంలో చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులోని కళ్యాణమండపంలో మంగళవారం మండల టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల విస్తృత స్థాయి సమావేశం మండల టీడీపీ నాయకుడు అర్తిమళ్ల రమేష్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రవీణ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాల వెనక్కి పోయిందని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వైసీపీ పాలనలో టీడీపీ, జనసేన నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులు న్యాయపరంగా ఎత్తివేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి, జిల్లా నాయకులు పఠాన్ నూర్జహాన్, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్వీవీఎస్ వరప్రసాద్, సర్పంచ్ గుడిపూడి రాజు, టీడీపీ లీగల్ సెల్ నాయకులు ఎం.హరిబాబు, మద్దిరాల గంగాధర్, సురేష్, తెలుగు రైతు నాయకులు భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీలు గల్లా బాబురావు, బి.రామగోపాలరావు, మండల టీడీపీ నేతలు అప్పారావు, సుబ్బయ్య, వి శివరామకృష్ణయ్య, పి.రామారావు, ఎం.సాగర్, ఎన్.మల్లిఖార్జున్, ఎస్.నాగేశ్వరరావు, బ్రహ్మయ్యతో పాటు జనసేన నాయకులు పాల్గొన్నారు. ముందుగా ప్రవీణ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు ప్రవీణ్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని జలాలపురంలో మంగళవారం పునీత జోజప్ప దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. చర్చి విచారణ గురువు ప్రవీణ్‌ను ఆశీర్వదించారు.

పెదకూరపాడు నియోజకవర్గానికి పూర్వవైభవం తెస్తా

అమరావతి, మార్చి 19 : రానున్న ఎన్నికలలో పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ సంయుక్త సహకారంతో ఎన్డీయే కూటమికి పూర్వవైభవం తీసుకువస్తానని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. స్థానిక జేబీ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన అమరావతి మండల ఉమ్మడి కూటమి ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి టీడీపీ రైతు నాయకుడు కె.వసంతరావు అధ్యక్షత వహించారు. మండల పరిధిలోని వేలాది మంది నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొని ప్రవీణ్‌కు మద్దతు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి శ్రీధరన్న చేసిన కృషి ఆదర్శనీయమని కొనియాడారు. గతంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఆశీర్వదించినట్లుగానే తనను ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, పఠాన్ నూర్జహాన్‌తో పాటు మండల పార్టీ అధ్యక్షులు మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మాచర్లటౌన్, మార్చి 19 : మండలంలోని ద్వారకాపురి గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు మంగళవారం ఆ పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వెల్దుర్తిలోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో వీరు వైసీపీలో చేరారు. బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో కంది వెంకటేశ్వరరెడ్డి, వినుకొండ పాపయ్య, ముడిగే శ్రీను, జల్లెల వెంకయ్య, శీలం శ్రీహరి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి రామిశెట్టి సైదారావు, సీతా అంజి, గన్నెబోయిన ప్రశాంత్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

● మాచర్ల రూరల్, మార్చి 19: పట్టణంలోని 8వ వార్డుకు చెందిన 45 వైసీపీ కుటుంబాలు మంగళవారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, సాతులూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, మార్చి 19 : మండలంలోని పెదకొదమగుండ్ల పంచాయతీ రెడ్డిపాలేనికి చెందిన పలువురు వైసీపీ నేతలు మంగళవారం ఆ పార్టీని వీడి వైసీపీలో చేరారు. వెల్దుర్తిలోని తన నివాసంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ కారంపూడి మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు బొల్నేడి శ్రీను, పెదకొదమగుండ్ల మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కోదాడి ప్రభాకర్, కొమ్ము పేరయ్య నేతృత్వంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చేరిన వారిలో వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి కడియం శ్రీహరి, కొమ్ము ఏసోబు, రాగిపాటి సాగర్, నాగెళ్ల లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన ఆర్యవైశ్య ప్రముఖులు, న్యాయవాదులతో యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 19 : పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావును పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్య సామాజికవర్గ నేతలు, న్యాయవాదులు, వ్యాపారులు కలిశారు. వైసీపీ పాలనతో తామెంతో విసిగిపోయామని, అభివృద్ధిలే క అప్పులతో రాష్ట్రాన్ని ఎన్నాళ్లు నడుపుతారో అర్థంకాక యువత భవిష్యత్ అంధకారమైందని, గురజాల నియోజకవర్గంలో వ్యాపారుల ఆస్తులకు భద్రత లేకుండా పోయిందని ప్రముఖ న్యాయవాది రెడ్డి సాంబశివరావు అన్నారు. సుమారు 32 కుటుంబాల వారికి యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఎన్న డూ లేనివిధంగా ఈ ఐదేళ్లలో పిడుగురాళ్ల, గురజాలలో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన సొంత ఆస్తులు సైతం కబ్జాకు గురయ్యాయని, ఎవరి ఆస్తులకు వారే రక్షణగా వుండాల్సిన దుస్థితి కలిగిందన్నారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు కనిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు ఉడతా కోటేశ్వరరావు, కుమారస్వామి, షేక్ ఈఫ్రాయిమ్, ఎం వెంకటేశ్వర్లు, జి రమేష్, వి అచ్చారావు, రెడ్డి గణేష్‌బాబు, మాశెట్టి పుల్లారావు, రెడ్డి మురళీ, రెడ్డి విశ్వేశ్వర రావు, డి సలీమ్, ఎంవి పిచ్చారావు, గోపు నరసింహారావు, రాకేష్, కమలాకర్, రఫీ, గోపి, అజయ్‌నాయుడు, రాళ్లబండి గణేష్, తూనుగుంట్ల వెంకట శ్రీనివాస రావు, ఎం సాంబశివరావు, కార్తీక్, మురళీ,యశ్వంత్,బాబావలి, ఇర్ఫాన్, రెడ్డి వంశీకృష్ణ, రెడ్డి విష్ణుసాయి తదితరులు టీడీపీలో చేరారు.

దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవానికి యరపతినేని విరాళం

కరాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీత సమేత కోదండ రామాంజనేయ దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవానికి గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కరాలపాడు గ్రామస్తులు మంగళవారం యరపతినేనిని కలవగా ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు.

ఫేక్ ప్రచారాన్ని ఖండించిన యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 19: పిడుగురాళ్లలో ఆర్యవైశ్యులకు సంబంధించి తాను మాట్లాడినట్లు వైసీపీ పేటీఎం బ్యాచ్ సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఖండించారు. ఎన్నికల సమయంలో వైసీపీ పేటీఎం బ్యాచ్ సామాజికవర్గాల మధ్య విషపు ప్రచారాన్ని నింపడాన్ని ఏ ఒక్కరు నమ్మవద్దని, అసత్య ప్రచారాన్ని చేస్తున్న వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వనున్నట్లు తెలిపారు. గురజాల నియోజకవర్గంలో ఆర్యవైశ్య సామాజికవర్గానికి తాను మొదటి నుంచి అండగా వుంటున్న విషయాన్ని గుర్తుచేశారు.

రాష్ట్రంలో టీడీపీ పాలనతో అన్ని వర్గాలకు మేలు

● సూపర్ సిక్స్ ప్రచారంలో యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్లలో సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, పార్టీ నేతలు

పిడుగురాళ్ల, మార్చి 19: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు ఇబ్బందులే తప్ప ఎటువంటి మేలు కలగటం లేదని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం 21వ వార్డులో సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ గ్యారంటీ కార్డులను అందించారు. 21వ వార్డులో ఆర్యవైశ్య ప్రముఖులు పలువురు యరపతినే నిని స్వయంగా తమ ఇంటికి ఆహ్వానించారు. పలువురు బీజేపీ, జనసేన నేతలు కూడా యరపతినేనికి వార్డులో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బటన్ నొక్కుతూ ఏదో మేలు చేశానని చెప్పడమే తప్ప ఆ బటన్ ఎప్పటికి పనిచేయలేదని, రాష్ట్రంలో బటన్ నొక్కినా కొన్ని లక్షల మందికి ఎటువంటి పథకాలు అందలేదన్నారు. ఆయా వీధుల్లో పలువురు ఆర్యవైశ్య నేతలు కూడా యరపతినేనిని కలిసి రేపటి ఎన్నికలలో ఓటు వేసేందుకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, జనసేన నాయకులు కామిశెట్టి రమేష్, కోట హరి, కొమ్మినేని రామచంద్రరావు, జూలకంటి సుబ్రహ్మణ్యం, జీవిఎస్ మునేశ్వరరావు, పణితి రవి, పిల్లి చెన్నారావు, బీజేపి నాయకులు కట్టమూరి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి

మాచర్ల రూరల్, మార్చి 19 : మాచర్ల నియోజకవర్గంలో 15 యేళ్లుగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హయాంలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రైవేటు పరంగా ఎన్ని సంస్థలు స్థాపించారు, ఎంతమంది యువతకు ఉపాధి కల్పించారో అనే దానిపై వివరించాలని కోరారు. నియోజకవర్గంలోని పరిశ్రమలు కాంగ్రెస్ పార్టీ హయాంలో వచ్చినవేనని అన్నారు. వంగపాటి నాగరాజు, షేక్ బాబు, రాగిడి ప్రతాప్‌బాబు, గాదె పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు : జేసీ



సమావేశం నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్, మార్చి 19 : ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు, నియమాలను వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు, గురజాల డీఎస్పీ పల్లపురాజు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లు పరిశీలించిన జేసీ

దుర్గి, మార్చి 19 : మాచర్ల నియోజకవర్గ పరిధిలోని 101 పోలింగ్ బూత్‌లను జేసీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ మంగళవారం పరిశీలించారు. దుర్గిలోని బూత్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఓటరూ ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలన్నారు. రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేసే అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

నేడు గురజాలలో యరపతినేని పర్యటన

గురజాలటౌన్, మార్చి 19: పట్టణంలోని 8, 9 వార్డులు, పెద బావి, చిన మసీదు, రామాలయం సెంటర్‌లలో బుధవారం నిర్వహించనున్న శంఖారావం - బాబు సూపర్ 6 కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ గురజాల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పాల్గొననున్నట్లు టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు తెలిపారు.

ఏపీఆర్‌జేసీ గణిత అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం

మాచర్ల రూరల్, మార్చి 19 : మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని ఏపీఆర్‌జేసీ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకుడు కోటా లింగేశ్వరరావుకు వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. స్ట్రక్చర్ ఆఫ్ హైపర్ ఐడియల్స్ ఇన్ టెర్నరీ సెమీ హైపర్ రింగ్స్ వ్యాసానికి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఆమోదం తెలిపింది. లింగేశ్వరరావుకు పీహెచ్‌డీ ప్రదానంపై ఏపీఆర్‌జేసీ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఎన్నికల స్క్వాడ్ ఆఫీసర్‌గా పాపయ్య

రెంటచింతల, మార్చి 19 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అవినీతి, అక్రమాలను నిరోధించడానికి మండల ఎన్నికల స్క్వాడ్ ఆఫీసర్‌గా కె.పాపయ్యను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివ శంకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమంగా తరలిస్తున్న డబ్బును స్వాధీనం చేసుకుని ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు తెలియచేయడం, ఓటర్లను ప్రలోభాలకు గురికాకుండా పర్యవేక్షణ, మద్యం సరఫరాను నిరోధించడంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియచేయడం తన బాధ్యత అన్నారు.

ప్రియాంకబాయికి న్యాయం చేస్తాం : ఎంఈవోలు

కారంపూడి, మార్చి 19 : పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ప్రియాంకబాయికి తగిన న్యాయం చేస్తామని ఎంఈవోలు కాంతారావు, రవికుమార్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంకబాయి సోమవారం తెలుగు పరీక్ష రాయాల్సి ఉండగా, ఆ బాలిక హాల్ టిక్కెట్‌లో హిందీ అని ఉండడంతో ఇన్విజిలేటర్ హిందీ ప్రశ్నాపత్రం ఇచ్చారు. కాగా పొరపాటును సరిదిద్దుతూ ఈనెల 31వ తేదీన ప్రియాంకబాయి తెలుగు పరీక్ష రాసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఎస్ఎస్‌సీ బోర్డు డైరెక్టర్ దేవానందరెడ్డి, ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు చొరవతో సమస్య పరిష్కారమైనట్లు అధికారులు చెప్పారు.

నేడు ఆంజనేయస్వామి దేవాలయ గాలి గోపుర ప్రతిష్ఠ

కారంపూడి, మార్చి 19 : కారంపూడి నుంచి దాచేపల్లి వెళ్లే రహదారిలోని వేపకంపల్లి అడ్డరోడ్డు పక్కన ఉన్న ఆంజనేయస్వామి దేవాలయానికి గాలి గోపురాన్ని ఒప్పిచర్లకు చెందిన మల్లెల రవి ఏర్పాటు చేయించారు. బుధవారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఈ గోపురాన్ని ప్రతిష్ఠించనున్నారు. అన్న సంతర్పణ గావించనున్నారు. మాదల సత్యనారాయణ, మల్లెల కోటేశ్వరరావు పర్యవేక్షించనున్నారు.

ముటుకూరు తిరునాళ్ల

దుర్గి, మార్చి 19 : ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోటప్పకొండ తిరునాళ్ల తరువాత అంతటి వైభవంగా నిర్వహించే తిరునాళ్ల ముటుకూరు తిరునాళ్ల. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మంగళవారం నిర్వహించిన తిరునాళ్ల మూగబోయింది. ఎలక్ట్రికల్ ప్రభల ఏర్పాటు లేకపోవడంతో భక్తుల రాక తగ్గింది. గ్రామంలో ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని భక్తులు దర్శించుకున్నారు.

ప్రభుత్వ మద్యం షాపుల్లో తనిఖీ

దుర్గి, మార్చి 19: స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణాలను మంగళవారం సెబ్ అధికారులు తనిఖీ చేశారు. దుకాణాల్లోని రికార్డులను తనిఖీ చేశారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెల్లం ఊట ధ్వంసం

వెల్దుర్తి, మార్చి 19: మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెంలో మంగళవారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు.



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో తెలుగు యువత నేతలు

ఎంపీ లావును కలిసిన తెలుగు యువత నేతలు

సత్తెనపల్లి మార్చి 19 : నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును మంగళవారం తెలుగు యువత పట్టణ మాజీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, శాలివాహన సంఘ నేత ఆరేపల్లి ఏడుకొండలు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికలలో కృష్ణదేవరాయలు, కన్నా విజయం కోసం పని చేస్తామన్నారు.

పెద్ద మసీద్‌లో భాష్యం ప్రవీణ్ ప్రార్థనలు

అమరావతి, మార్చి 19: అమరావతిలోని పెద్దమసీద్‌లో జరిగిన రంజాన్ ఉపవాస ప్రార్థనలో పెదకూరపాడు నియేజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ప్రవీణ్ రాకతో స్థానిక ముస్లీం పెద్దలు, టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మతపెద్దలు ప్రవీణ్‌కు మంచి జరగాలని ఆశీర్వదించారు.



ప్రార్థనలలో పాల్గొన్న భాష్యం ప్రవీణ్, ముస్లింలు

టీడీపీ, జనసేన కార్యకర్తల మృతికి ప్రవీణ్ సంతాపం

క్రోసూరు, మార్చి 19 : క్రోసూరు, బయ్యవరం గ్రామాలలో మరణించిన టీడీపీ కార్యకర్తల మృతికి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. క్రోసూరులో మరణించిన టీడీపీ కార్యకర్త మద్దారపు శ్రీనివాసరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ స్థానిక నాయకుల ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. టీడీపీ నాయకులు కాంద్రు కాశయ్య, అనుముల వెంకటరామిరెడ్డి, నరజాల కోటేశ్వరరావు, దుద్దుల యోహాన్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బయ్యవరంలో మరణించిన నాగటి లూర్ధమ్మ కుటుంబ సభ్యులకు కూడా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. నియోజకవర్గ జనసేన సమన్వయకర్త యర్రశెట్టి రామకృష్ణ ద్వారా సహాయం అందించి సంతాపం వ్యక్తం చేశారు. పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రవీణ్ సతీమణి లావణ్య ఎన్నికల ప్రచారం

పెదకూరపాడు, మార్చి 19 : పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మోజారిటీతో గెలిపిం చాలని కోరుతూ ఆయ న సతీమణి లావణ్య మండలంలోని కంభంపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మహిళల కోసం అనేక పథకాలను రూపొందించిందని అన్నారు. వైసీపీ పాలనలో మహిళలపై దాడులు రోజురోజుకు పెరిగాయని అన్నారు. మాజీ ఎంపీపీ పాటిబండ్ల శివమ్మ, మాజీ ఎంపీటీసీలు అర్తిమళ్ల పద్మావతి, షేక్ ముంతాజ్, మాజీ ఉపసర్పంచ్ ఏ వెంకటకృష్ణ, టీడీపీ రాష్ట్ర నాయకులు జి.లీలావతి, కె.పద్మలత ఉన్నారు.

బూత్ కమిటీలు అప్రమత్తంగా వ్యవహరించండి

అచ్చంపేట మార్చి 19 : బూత్ కమిటీ, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్నికల మండల పరిశీలకుడు భాష్యం ప్రసాద్ అన్నారు. స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అధ్యక్షతన బూత్ కమిటీ, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలనీ, కొత్త ఓటర్లను చేర్చుకునేందుకు అవకాశం కలిగిందని ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సభ్యులతో మాట్లాడారు. ఈ శిక్షణా కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బత్తుల శ్రీనివాసరావు, మొటిపాటి గిరిబాబు, పసుపులేటి పాపిరెడ్డి, వెనిగండ్ల కోటయ్య, తాళ్ళూరి సుబ్బారావు, పోట్ల శ్రీనివాసరావు, చల్లా అనూపకళ, తిరువాయిపాటి ఆంజనేయులు, బోడెల సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి రంగానాయక్

మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో గల కంచుగోడు తండాకు చెందిన బాణావత్తు రంగా నాయక్ మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం రంగా నాయక్ వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. 24 గంటలు గడవక ముందే టీడీపీ మండల కమిటీ సమక్షంలో సొంతగూటికి చేరారు.

దైవభక్తి, దైవ భయం పిల్లల అభివృద్ధికి మూలం

అచ్చంపేట మార్చి 19 : దైవభక్తి, దైవ భయం పిల్లల అభివృద్ధికి కారణమవుందని గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండలంలోని కోగంటివారిపాలెంలో పునీత జోజప్ప నూతన దేవాలయాన్ని మంగళవారం బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య ప్రారంభించారు. దివ్యబలిపూజ నిర్వహించి కుటుంబాల విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరూ నైతిక విలువలతో జీవించాలని, క్రైస్తవ జీవితం ఇతరులకు ఆదర్శంగా ఉండాలన్నారు. తాళ్ళచెరువు విచారణ గురువు ఫాదర్ పుట్టి అంతోని రాజు, ఫాదర్ కిరణ్, కన్యాస్త్రీలు, 25 మంది గురువులు, వేలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

హోంగార్డు సుభానీ సేవలు అభినందనీయం

ముప్పాళ్ళ మార్చి 19 : చాలీచాలని జీతమే అయినా 21 సంవత్సరాలుగా సొంత నిధులతో చలివేంద్రాన్ని పెట్టి ప్రజల దాహాన్ని తీరుస్తున్న హోంగార్డు సేవలు అభినందనీయమని సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు అన్నారు. మండలంలోని దమ్మాలపాడు అడ్డరోడ్డు వద్ద సుభానీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ రాంబాబు, ఎస్ఐ హజరతయ్య ప్రారంభించారు. నరసరావుపేట రవీంద్రా గ్యాస్ట్రో, లివర్ కేర్ హాస్పటల్ డాక్టర్ పాతూరి అశోక్, డాక్టర్ రవీంద్ర కట్టమనేనిలు వ్యవసాయ కూలీలకు మజ్జిగను పంపిణీ చేశారు.



కన్నా లక్ష్మీనారాయణను కలిసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

కన్నా విజయం కోసం కృషి చేస్తాం : బీజేపీ నేతలు

సత్తెనపల్లి మార్చి 19 : పట్టణంలోని రఘురాంనగర్‌లో గల కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో పట్టణ బీజేపీ నేతలతో కన్నా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తన విజయం కోసం కృషి చేయాలన్నారు. ఇంకా వివిధ అంశాలను గురించి వారితో కన్నా చర్చించారు. పలు విషయాలను బీజేపీ నాయకులు కన్నాకు వివరించారు. కన్నాను బీజేపీ నాయకులు సన్మానించారు. వివిధ హోదాలలో ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

సత్తెనపల్లి, మార్చి 19 : పట్టణంలోని 3 వార్డుకు చెందిన వైసీపీ కార్యకర్త దనావత్ దుర్గారావు నాయక్ టీడీపీ పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శంకర్ నాయక్ సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. దుర్గారావు నాయక్‌కు టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కన్నాను కలిసిన పాస్టర్‌లు

సత్తెనపల్లి మార్చి 19: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను మంగళవారం పాస్టర్‌లు దేవంగి కృపాకర్, పోతల విజయ్‌కుమార్, చెరుకూరి ఏలియాలు మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికలలో కన్నా లక్ష్మీనారాయణ విజయం కోసం కృషి చేస్తామని చెప్పారు.

మద్ది కోటేశ్వరరావుకు నివాళి

సత్తెనపల్లి మార్చి 19 : పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు తండ్రి కోటేశ్వరరావు మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజులు కోటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్ది వెంకటేశ్వరరావును పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ఆతుకూరి నాగేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, దూపగుంట్ల జానకీ రామారావు, నూర్‌బాషా జానీబాబు తదితరులున్నారు.

చంద్రబాబు హయాంలోనే మాదిగలకు మేలు

● టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

సత్తెనపల్లి మార్చి 19 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు హయాంలోనే మాదిగలకు మేలు జరిగిందని టీడీపీ ఎస్సీ సెల్ నేతలు బొక్కా సంగీతరావు, బలిజేపల్లి సురేష్ కుమార్, బండారు నాగరాజు, చిలకా శ్యామ్, గుజ్జర్లపూడి స్టాన్లీలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి సీఎం జగన్ మాదిగలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఒక్క లాయర్‌ను కూడా నియమించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయం ద్వారా మాదిగల వ్యతిరేకి ముఖ్యమంత్రి జగన్ అని తేలిందని అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే 22 వేల మంది మాదిగలకు ఉద్యోగాలు రావడంతోపాటు సంక్షేమం, రాజకీయంగా మేలు జరిగిందన్నారు.

మాదిగల వ్యతిరేకి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించండి : ఎమ్మార్పీఎస్

క్రోసూరు, మార్చి 19 : మాదిగల వ్యతిరేకి జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికలలో చిత్తుగా ఓడించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జడ సుబ్బు మంగవారం పిలుపునిచ్చారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ మద్దతు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకే ఉంటుందన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణమాదిగ కూడా కూటమికే మద్దతు పలికిన విషయాన్ని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ, మాదిగ కార్పొరేషన్‌కు నిధులు కేటాయింపు, ఎస్సీలకే ప్రవేశపెట్టిన పథకాల రద్దు, అంబేద్కర్ విదేశీ విద్యాపథకం పేరు మార్పుతో జగన్‌మోహన్‌రెడ్డి దళిత ద్రోహిగా మిగిలి పోయారన్నారు. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని నరేంద్రమోదీ అనుకూలంగా ఉన్నందున రాష్ట్రంలో వర్గీకరణ చంద్రబాబుకే సాధ్యం అవుతుందన్నారు. మాదిగ ఓటర్లు అందరూ కూటమి అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు.

కన్నా గెలుపునకు నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలి

ముప్పాళ్ళ, మార్చి 19 : టీడీపీ, జనసేన, బీజేపి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గెలుపునకు నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలని, రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను ప్రజలకు తెలియజేసే బాధ్యతను యువత చేపట్టాలని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెంలో మంగళవారం టీడీపీ నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదిర రామ్మోహన్‌రెడ్డి, అన్నపరె డ్డి శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీనివాసరావు, మారూరి శ్రీనివాసరెడ్డి, జమ్ముల శ్రీనివాసరావు, పసుపులేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో నీలం పార్వతమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.





సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి మూడు రోజులు అవుతున్నా తమ కార్యాలయాలపై ఉన్న పార్టీల నాయకుల పేర్లను అధికారులు తొలగించడం లేదు. మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న వైయస్సార్ క్రాంతి పథం కార్యాలయం అని, చాగంటివారిపాలెం సచివాలయం వద్ద ఉన్న వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ అని ఉంది. దేశం మొత్తం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా తమకు వర్తించదనుకున్నారో ఏమో మరి ఆ కార్యాలయం ఉద్యోగులు. ముప్పాళ్ళ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న ఒక ప్రైవేటు వైద్యశాల బోర్డుపై కూడా ముఖ్యమంత్రి జగన్ బొమ్మ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల బొమ్మలు ఉన్నాయి. వీటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు. **- ముప్పాళ్ళ.**

గుంటుపల్లి మృతి బాధాకరం

పిడుగురాళ్ల, మార్చి 19: టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ బాబావలి తెలిపారు. బాబావలితో పాటు సయ్యద్ అమీర్‌అలీ, ఫరీద్‌మేస్త్రి, తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, ఎల్‌విఆర్, జొన్నలగడ్డ శ్రీను, బొల్లా శ్రీను, కొమ్మినేని రామచంద్రరావు, దియ్యా రామకృష్ణ, మేకల సాంబశివరావు, రాంబాబు, వల్లెపు రామకృష్ణ, కుంచపు గంగరాజు, తదితరులు గుంటుపల్లి నాగేశ్వరరావుకు నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

● సత్తెనపల్లి, మార్చి 19 : నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు అకాల మరణం నాయీబ్రాహ్మణ సేవా సంఘానికి తీరని లోటని సేవా సంఘం మాజీ అధ్యక్షుడు పత్తిపాటి హరేకృష్ణ, పలువురు సంఘం నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంతాపం తెలిపిన వారిలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు పిల్లుట్ల సుబ్బారావు, సంఘ నాయకులు డాక్టర్ పరమేశ్వరరావు, పత్తిపాటి శివన్నారాయణ, చంద్రగిరి కోటేశ్వరరావు, శివయ్య, కొమ్మూరి ప్రసాద్ తదితరులున్నారు.

● రెంటచింతల, మార్చి 19 : రాష్ట్ర నాయీబ్రాహ్మణుల సంఘం చైర్మన్, టీడీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు మృతికి స్థానిక నాయీబ్రాహ్మణులు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. దాచేపల్లి వెళ్లి నాగేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సురభి వెంకటేశ్వర్లు, నందికొండ శ్రీనివాసరావు, ఏడుకొండలు, చలమయ్య, లక్ష్మయ్య, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రెండు రోజులు తాగునీటి సరఫరా నిలిపివేత

నరసరావుపేట రూరల్, మార్చి 19: పట్టణంలోని తాగునీటి సరఫరాకు రెండు రోజులపాటు నిలిపివేయడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి తెలిపారు. నరసరావుపేట మండలం రావిపాడు వద్ద తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు ఏర్పడి తాగునీరు లీకులు అవుతున్న నేపథ్యంలో గురువారం, శుక్ర వారం రెండురోజులపాటు మరమ్మతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. శని వారం ఉదయం యథావిధిగా తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

ఎన్నికల కోడ్ అమలు పరిశీలనకు కమిటీ ఏర్పాటు

చిలకలూరిపేట, మార్చి 19: చిలకలూరిపేట నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమలు తీరు పరిశీలనకు అధికారికంగా ఒక కమిటీ ఏర్పాటయింది. ఈ మేరకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి నారదముని మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త కమిటీకి రిటర్నింగ్ అధికారిగా నారదముని చైర్మన్‌గా వ్యవహరి స్తారు. కమిటీలో సభ్యులుగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఉన్నారు. సభ్యులుగా పి బ్రహ్మానందం (బీజేపీ), ఎం రాధాకృష్ణ (కాంగ్రెస్), ఎం మల్లిబాబు (టీడీపీ), ఎన్ కోటేశ్వరరావు (బీఎస్పీ) విడదల రవిశ్రీనివాసరావు (వైసీపీ), పి వెంకటేశ్వర్లు (సీపీఎం), డీఎస్పీ నరసరావుపేట, ఏఆర్వో, తహసీల్దార్ చిలకలూరిపేట ఉంటారు.




చెత్త కుప్పలో పడిఉన్న వృద్ధుడు మహేశ్వరెడ్డి, కాశయ్య చేరదీసిన అనంతరం

అనాథ వృద్ధుడికి 'శ్రీకరుణ'లో ఆశ్రయం

నరసరావుపేట టౌన్, మార్చి 19: నరసరావుపేట మండలం లింగంగుంట్ల పరి ధిలోని సాయిబాబా గుడి సమీపంలో ఓ వృద్ధుడు దిక్కు, మొక్కులేని స్థితిలో చెత్త కుప్పలో పడిఉన్నారు. ఇది గమనించిన పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న రామ్మూర్తి పడమర వీరాయపాలెంలోని శ్రీకరుణ ఆశ్రమ నిర్వాహ కుడు కాశయ్యకు సమాచారం అందజేశాడు, కాశయ్య వచ్చి ఆ వృద్ధుడిని చేరదీసి స్నానం చేయించి ఆహారం అందించడంతో తేరుకున్నాడు. ఆశ్రమ నిర్వాహకుడు కాశయ్య వివరాలు అడగడంతో తన పేరు మహేశ్వరెడ్డి అని, గిద్దలూరు సమీపం లోని సోమిదేవిపల్లె అని, తనకు భార్య పిల్లలు ఉన్నారని, వృద్ధాప్యం వలన ఏవరూ చేరదీయకపోవడంతో భిక్షాటన చేస్తూ నరసరావుపేట చేరుకున్నానని తెలి పాడు. భిక్షాటనకు కూడా ఓపిక లేకపోవడంతో చెత్తకుప్పలో పడిఉన్నట్లు తెలి పాడు. మహేశ్వరెడ్డిని ఆశ్రమ నిర్వాహకుడు కాశయ్య పోలీసు కానిస్టేబుల్ సీహెచ్ బాబు సహకారంతో వృద్ధాశ్రమానికి మంగళవారం తరలించారు.

గుంటుపల్లికి అరవిందబాబు ఘన నివాళి



గుంటుపల్లి భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 19: టీడీపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు గుంటుపల్లి నాగే శ్వరరావు మంగవారం నర సరావుపేటలో మృతిచెం దారు. అనారోగ్యంతో నరస రావుపేటలోని మహాత్మా గాంధీ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. భౌతికకయాన్ని టీడీపీ నరసరవుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిం దబాబు, టీడీపీ గురజాల నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు ఫోనుచేసి మాట్లా డారు. గతంలో రెండుసార్లు నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా గుంటుపల్లి నాగేశ్వరరావు పనిచేశారు. గుంటుపల్లి మృతదేహాన్ని స్వగ్రామం గురజాల నియో జకవర్గం దాచేపల్లికు తరలిస్తామని బంధువులు తెలిపారు.

గుంటుపల్లి మృతి బాధాకరం: సుందరబాబు

యడ్లపాడు, మార్చి 19: తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ సంఘం జాతీయ కమిటీ సభ్యుడు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు మృతి బాధాకరమని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాదెండ్ల సుందరబాబు అన్నారు. మంగళవారం సేవా సంఘం ఆధ్వర్యంలో నాగేశ్వరరావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల గొంతుక మూగబోయిందన్నారు. నాగేశ్వరరావు మృతి తెలుగుదేశం పార్టీకి, నాయీ బ్రాహ్మణులకు తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో సేవా సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాసరావు, సభ్యులు నాదెండ్ల వెంకటేశర్లు, నాదెండ్ల రాధాకృష్ణ, మాచవరపు సుబ్రమణ్యం, పిల్లుట్ల సుబ్బారావు, నాదెండ్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వినుకొండ డిపో నుంచి అరుణాచలానికి బస్సు

వినుకొండ, మార్చి 19: మార్చి 25 తేదీన మహాపౌర్ణమి సందర్భంగా వినుకొండ డిపో నుంచి అరుణాచల గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం కోటేశ్వరరావు నాయక్ మంగళవారం తెలిపారు. అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలనికోరారు. పూర్తివివరాలకు 9959225431 సంప్రదించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో సుబ్బారావు, పాల్గొన్న కమిషనర్ కృష్ణవేణి, ఇతర అధికారులు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఆర్‌వో

వినుకొండ, మార్చి19. ఎన్నికల కోడ్‌లో ఎక్కడైనా సమస్యలు ఎదురైనా, కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘించినా, అధికార దుర్వినియోగంచేసినా వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బారావు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిర్వ హణలో సూచనలు, సలహాలు ఇవ్వాలని, ఎవరూ తప్పుడు సమాచారాన్ని పోస్టులు పెట్టరాదని, తప్పుడు సమాచారం అందిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని కోరారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే కంట్రోల్‌రూమ్ 08646-272000 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, సీఐ సాంబశివ రావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి



నరసరావుపేట రూరల్, మార్చి 19: మండలంలోని కేశా నుపల్లి పంచాయతీ పరిధిలోని ఎంఎఎం కళాశాల దగ్గర దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది నట్లు రూరల్ ఎస్‌ఐ రోశయ్య తెలిపారు. ఈ వ్యక్తి వివరాలు తెలిసినట్లయితే నరసరావుపేట రూరల్ సీఐ మల్లికార్జున 9440796244, రూరల్ ఎస్‌ఐ 9440796224 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

23నుంచి 29 వరకు భగత్‌సింగ్,రాజగురు, సుఖదేవ్‌ల సంస్మరణ

నరసరావుపేట టౌన్, మార్చి 19: భారతదేశ విముక్తి కోసం అసువులు బాసిన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల సంస్మరణ సభ ఈ నెల 23 నుంచి 29 వరకు నిర్వహించాలని పీడీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు అన్నారు. మంగళ వారం స్థానిక అష్ఫాకుల్లాఖాన్ కాలనీలో సంస్మరణ కార్యక్రమం కరపత్రం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వీరుల సంస్మరణ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కరపత్ర ఆవిష్కరణ కార్య క్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ, నల్లపాటి రామారావు, సీఐటీయూ షేక్ సిలార్, బీసీ సంఘం నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు, జక్రయ్య తది తరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌పై ఉదాశీనంగా అధికారులు




వినుకొండ పట్టణంలోని నూజండ్ల రైల్వేగేట్ ఆర్‌యూబీ గోడలకు ఉన్న వైసీపీ రంగులు, డిగ్రీ కళాశాల వద్ద ఆర్చికి ఉన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేరు

వినుకొండ టౌన్, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన అధికా రులు వైసీపీ రంగులు విషయంలో ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు పట్టణంలో వినిపిస్తున్నాయి. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఇంటి వద్ద ఏర్పాటుచేసిన భారీ కటౌ ట్లపై తొలగించిన అధికారులకు చెక్కపోస్టు సెంటర్‌లో వైసీపీ రంగులు ఉన్నాయి. ఇటీవల రైల్వే అధికారులు కోట్ల రూపాయలు వెచ్చించి ఆర్ యూబీ నిర్మాణ పనులు చేపట్టారు, పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌తో అధి కార పార్టీ నేతలు ఆర్‌యూబీ గోడలకు వైసీపీ రంగులు వేయించారు. ఇరు వైపులా గోడలకు వేసిన రంగులు తొలగించకపోవడంతో మున్సిపల్ అధికా రులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడడంతో పాటు, వైసీపీ పార్టీకి కొమ్ముకాస్తు న్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా నూజండ్ల మండలం ఉప్పలపాడు విలేజి క్లినిక్‌పై ఉన్న నాయకుల ఫొటోలు తొలగించి చేతులు దులుపుకుని, గోడలపై వేసిన రంగులు తొలగించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఇదిలా వుండగా నూజండ్ల రహదారిలోని డిగ్రీ కళా శాల సమీపంలో స్టేడియం పేరుతో నిర్మించి ఆర్చికి స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేరును కనిపించకుండా ఏర్పాట్లు చేయలేదు. కోడ్ అమలుపై అధికారులు దృష్టిసారించా లని పలువురు కోరుతున్నారు.

రేషన్ వాహనాలపై...

శావల్యాపురం, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లోకొచ్చి మూడ్రోజులు గడు స్తున్నా పార్టీ గుర్తులు తొలగించడంలో అధికారులు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రేషన్ పంపిణీ చేసేందుకు వినియోగిస్తున్న ఎండీయూ వాహనాలపై సీఎం జగన్ బొమ్మలు, పార్టీ గుర్తులను మంగళవారం వరకు తొలగించలేదు. విషయాన్ని కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతో ఎండీయూ ఆపరేటర్‌లు జగన్ బొమ్మ లకు అడ్డుగా తాత్కాలికంగా న్యూస్‌పేపర్‌లు అంటించి వైసీపీ రంగులు మాత్రం తొలగించకుండా అలానే ఉంచారు. కొన్ని ఎండీయూ వాహనాలపై న్యూస్ పేపర్లు కూడా సక్రమంగా అంటించకపోవడంతో వైఎస్సార్ పేరుతో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు కనిపిస్తున్నాయి. మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై ఉన్న సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు తాత్కాలికంగా న్యూస్‌పేపర్‌లు అంటిం చారు. ఎన్నికల కోడ్‌పై అధికారులు గ్రామస్థాయిలో పర్యటించి ఎన్నికల నిబంధనలను అమలుచేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చిలకలూరిపేటలో ...

చిలకలూరిపేట, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికా రులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదివారం మూడు పార్టీల బహిరంగ సభ తోపాటు అంతకుముందు పట్టణంలోని అన్ని రోడ్లు, సెంటర్లలో ఉన్న ఫ్లెక్సీ లను, తోరణాలను రాత్రికి రాత్రి తొలగించారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు.

తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం

● గోనుగుంట్ల హరీష్

వినుకొండ టౌన్, మార్చి 19: తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెలే జీవీ ఆంజనేయులు తనయుడు హరీష్ అన్నారు. పట్టణంలోని రైలుపేటలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్ర మంలో భాగంగా మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ అవినీతిలేని పాలన సాగాలంటే జీవీ ఆంజనేయులు, నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలను అఖండ మెజార్టీతో గెలిపించాని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, జనసేనన, బీజేపీ, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500 నగదు ఇవ్వడం జరుగుతుం దని, తల్లికి వందనం పేరుతో రూ.15,000 నగదుతోపాటు ఇతర పథకాలు నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తారన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అహంకారానికి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు ఎన్నిక లకు ముందు అనేక వాగ్దాలు చేసి ఒక్క హామీ నెరవేర్చకపోగా, అధికారం అడ్డుపెట్టుకొని వైసీపీ ప్రభుత్వం అవినీతి అక్రమాలతో దోపిడీ చేశార న్నారు. ఇసుక, రేషన్, మద్యం మాఫియాతో కోట్లు కొల్లకొట్టారని విమర్శిం చారు. గతంలో జీవీ ఆంజినేయులు ఎమ్మెల్యేగా పనిచేసి సమయంలో వినుకొండలో ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఐదు సంవత్సరాల కాలంలో వినుకొండలోని పరి స్థితులు ఎలా ఉన్నాయో ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో నీతికి - అవినీతికి మధ్య పోరాటం సాగుతుందన్నారు. ప్రజలకు ఉపాధి కావాలన్నా, వ్యాపారుల ఆస్తులకు రక్షణ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలంటే జీవీ ఆంజనేయులు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ ఆయూబ్ ఖాన్, సీహెచ్ షమీమ్, సొధా గర్ జానీబాష, సుబేదార్ అజీజ్, చికెన్‌బాబు, గుంటకల నాగేశ్వరరావు, మక్కెన మహేష్, కరీమ్, జానీ, ఖాసిం, ధావులూరి మునయ్య, నాయుడు పాలెం మస్తాన్ వలి, లింగా రామయ్య, శైలజ, షేక్ మస్తాన్, ఈశ్వరమ్మ, బసమ్మ, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



11వార్డు రైలుపేటలో టీడీపీ మ్యానిఫెస్టో క్యాలెండర్ పంపిణీచేస్తున్న జి.వి హరీష్, పార్టీ నాయకులు

వైభవంగా అభయాంజనేయస్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి

రొంపిచర్ల: మార్చి 19: మండ లంలోని గోగులపాడులోని సువ ర్చల సమేత అభయాంజనేయ స్వామి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. 30వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి పంచామృత అభి షేకం, నాగవల్లి దళార్చన పూజ లను అర్చకులు వెంకటహను మంత ఆచార్యులు, రుక్మిణి కృష్ణ మాచార్యులు నిర్వహించారు. అనం తరం స్వామివారికి విశేష అలంక రణ చేశారు. మహిళలు పొంగళ్లు నిర్వహించి మొక్కుబడి తీర్చుకు న్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు. సాయంత్రం భజన కార్యక్ర మాలు జరిగాయి.

వైసీపీని వీడి టీడీపీలోకి పలువురి చేరిక

బొల్లాపల్లి, మార్చి 19: మండలంలోని సోమలగూడతండా, గంగుపల్లి తండాలకు చెందిన వైసీపీ నాయకులు మంగళవారం టీడీపీలో చేరారు. పార్టీలోచేరిన వారికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.

ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యటన



కొత్తపల్లిలో బోర్డు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రొంపిచర్ల, మార్చి 19: మండలం లోని పలు గ్రామాల్లో ఎన్నికలు ఫ్లైయింగ్ స్క్వాడ్ మంగళవారం పర్య టించింది. కొత్తపల్లి, రెడ్డిపాలెం, మరిచె ట్టుపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన బోర్డులను తొలగించారు. ఎన్నికల నియమావళి ప్రకారం పార్టీల జెండా లను, బోర్డులను తొలగిస్తున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి మణిదీప్ తెలిపారు. పార్టీల నాయకులు తమకు సహకరించాలని కోరారు. ఎవరైనా సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు



రొంపిచర్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రొంపిచర్ల, మార్చి 19: మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో రొంపిచర్ల, కొనకంచివారిపాలెం, గోగులపాడు, అలవాల గ్రామాల్లో జరిగింది. సీఆర్పీ ఎఫ్ బలగాలు, పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల సమ యంలో ఎటువంటి ఘర్షణలకు దిగరాదన్నారు. రాత్రి 10గంటల తర్వాత దుకాణాలు మూసివేయాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నేడు కోదండ రామస్వామి ఆలయ ప్రారంభోత్సవం

రొంపిచర్ల, మార్చి 19: మండలం బెహరావారి పాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామస్వామి వారి దేవాలయం ప్రారంభోత్సవం బుధ వారం జరగనుంది. శోభకృత్ సంవత్సర ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సంద ర్భంగా రొంపిచర్ల ఉదయం 10: 26 నిమిషాలకు దేవాలయ ప్రారంభో త్సవం, స్వామి వారికి అభినవ మహాప్రతిష్ఠ దేవాలయ ప్రారంభోత్సవం జరుగుతుందని కోదండ రామస్వామి దేవాలయ కమిటీ సభ్యులు తెలియ జేశారు. దేవాలయ ప్రారంభోత్సంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొ ని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

నాదెండ్ల, మార్చి 19: యోగా మానసిక ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక సాధనకు దోహదపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ అన్నారు. సాతు లూరులో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో పోష ణ పట్వాడా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో యోగాసనాలు వేయిం చారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ బుద్ధ, జైన, సిక్కు తదితర మతాలలో ఆధ్యాత్మిక సాధనలో దీని ప్రాధాన్యం కనిపిస్తున్నదన్నారు. ప్రతి ఒక్కరు యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె వెంకట్రావు, ఏఎన్‌ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ప్రచారం

వినుకొండ, మార్చి 19: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు, నర్సరావుపేట పార్ల మెంటు అభ్యర్థిగా అనీల్ కుమార్ యాదవ్ గెలిపించాలంటూ మండలం లోని ఏనుగుపాలెం రోడ్డులోని పలు గ్రామాల్లో మంగళవారం వైసీపీ ఆధ్వ ర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తొలివిడతలో జరగాల్సిన ఎన్నికలను, చం ద్రబాబు నాయుడు ఎన్డీఏ ప్రభుత్వాన్ని కోరి నాలుగో విడతలో ఎన్నికలు జరిగేలా చేశారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా గెలుపును మాత్రం ఆపలేర న్నారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'లోక్ అదాలత్‌లపై అవగాహన కలిగించాలి'

గుంటూరు, మార్చి 19: కోర్టులపై పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించ డంతో పాటు సామాన్యులకు సత్వర న్యాయం అందించే ఉద్దేశంతో ఏర్పా టైన లోక్ అదాలత్ వ్యవస్థపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని' అవగాహన సంస్థ నిర్వహించిన సమావేశంలో పలు వురు న్యాయవాదులు, మేధావులు అభిప్రాయపడ్డారు. సత్వర న్యాయం లోక్ అదాలత్ వల్లనే సాధ్యం అనే అంశంపై మంగళవారం జరిగిన సమా వేశంలో న్యాయవాది ముప్పాళ్ళ వీఎస్ ప్రసాదరావు మాట్లాడారు.

రైళ్లలో దోపిడీలకు పాల్పడుతున్న యువకుల అరెస్టు

తెనాలి క్రైం, మార్చి 19: రైళ్ళలో ప్రయాణికులను బెదిరించి దోపిడీకి పాల్పడుతున్న యువకులను తెనాలి రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. మంగళవారం రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నిందితులను వివరాలను వెల్లడించారు. రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం మేరకు విజయవాడకు చెందిన 8మంది యువకులు ముఠాగా ఏర్పడి తరచూ రైళ్ళలో ప్రయాణికులను బెదిరించి వారి వద్ద నుంచి నగదు, ఇతర వస్తువులు దోపిడీ చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో నిఘా ఉంచిన రైల్వే పోలీసులు సోమవారం రాత్రి టాటా నగర్ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి పాల్పడుతున్న సమయంలో వారిపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో వీరు తెనాలి స్టేషన్‌లో ట్రైన్లు ఎక్కి విజ యవాడ చేరేలోపు ప్రయాణికులను బెదిరించి విజయవాడ ఔటర్‌లో ట్రైన్ రన్నింగ్‌లో దిగి పారిపోతూ ఉంటారని, వీరిపై ప్రత్యేక నిఘా ఉంచి అదుపు లోకి తీసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సమావేశంలో ఆర్పీఎఫ్ సీఐ ఆలీబేగ్, జీఆర్పీ ఎస్‌ఐ సరస్వతి, సిబ్బంది శివరామకృష్ణయ్య, పీఎస్ ఎన్‌మూర్తి, వేణు, కిషోర్‌బాబు, శివప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.



మాజీమంత్రి ప్రత్తిపాటిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాటికి టీడీపీ శ్రేణుల సన్మానం

చిలకలూరిపేట అర్బన్, మార్చి 19: బొప్పూడిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రజాగళంసభ విజయవంతమైన సందర్భంగా మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావును స్థానిక పార్టీ నాయకులు సన్మానిం చారు. చిలకలూరిపేట పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా ఎన్డీఏ భారీ బహిరంగ సభను అద్భుతంగా నిర్వహించారని ప్రత్తిపాటిని కొనియాడారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, పట్టణపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుబాల రవి, టీడీపీ నాయకులు అబ్దుల్‌కుమీర్, ముల్లా కరిముల్లా, మద్దిబోయిన శివ, బెజ్జం రవి, తన్నీరు పుల్లా రావు, జంగా వినాయకరావు, చింతకాయల వెంకటకోటయ్య తదితరులు ప్రత్తిపా టిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షాల విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం ఆశీ స్సులు, స్థానిక నాయకుల, కార్యకర్తల అండదండలతో చిలకలూరిపేటకు మంచి పేరు తెస్తానన్నారు. ప్రజాగళం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలియచేశారు.




గొట్టిపాటి శ్రీనివాసరావుకు నివాళులర్పిస్తున్న శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు,

శ్రీనివాసరావుకు మర్రి, ప్రత్తిపాటి, ఘననివాళి

చిలకలూరిపేట, మార్చి19: స్థానిక శ్రీ ధనలక్ష్మి గ్రూప్ సంస్థల డైరెక్టర్ దివంగత గొట్టిపాటి ప్రసాదరావు కుమారుడు గొట్టిపాటి శ్రీనివాసరావు మృతి చెందడంతో ఆయనకు మంగళవారం పలువురు పట్టణ ప్రముఖులు ఘనంగా నివాళులర్పిం చారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు, శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ధనలక్ష్మి గ్రూపు సంస్థల డైరెక్టర్లు, పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

సభలో భద్రతా వైఫల్యాలపై విచారణ చేపట్టాలి

● జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో కన్వీనర్ బాలాజీ

చిలకలూరిపేట, మార్చి 19: ప్రజాగళం సభలో పోలీసు అధికారుల వైఫల్యం వల్లనే ప్రజలు ఇబ్బందులుపడ్డారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో కన్వీనర్ పెంటేల బాలాజీ మంగళవారం ఆరోపించారు. మంగళవారం ఇక్కడ తన కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా గళం సభ నిర్వహణ, విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన సభాప్రాంగణ కమిటీలో తాను కూడా సభ్యుడనన్నారు. వేలాదిమంది పోలీసులు ఉండి కూడా ట్రాఫిక్ నియంత్రించకపోవడం, స్వయాన ప్రధాని మోడీ హాజరైన సభలో భద్రతా పరమైన సమస్యలు తలెత్తడం చూస్తుంటే ఇందులో ఏదో కుట్రకోణం ఉందని ఆరో పించారు. సభలో తోపులాటలు, రభస జరిగి సభ నిర్వహణకు అంతరాయం కలి గినా, ఇలా ఎందుకు జరిగిందో, కారణాలేమిటనేది సమీక్షించకపోవటం పలు అను మానాలకు తావిస్తోందన్నారు. ఈ విషయాలపై సమగ్ర విచారణ నిర్వహించి, ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారంపై పెదవి విప్పండి: మాదాసు

చిలకలూరిపేట, మార్చి 19: చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థులు పట్టణంతోపాటు నియోజకవర్గంలో ఉన్న సమస్యలు, వాటికి పరిష్కా రాలు, అవి ఎప్పటిలోగా పరిష్కరించగలరు అనే విషయాన్ని నియోజకవర్గం ప్రజ లకు తెలియజేయాలని ప్రజా మేనిఫెస్టో కన్వీనర్ మంగళవారం మాదాసు భాను ప్రసాద్ కోరారు. ఎన్నికలు పోటీచేసే అభ్యర్థుల భవితవ్యం కోసం కాదని లక్షలాది మంది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఉండాలని కోరారు. చిలకలూరిపేట పట్ట ణంలో ఇప్పటికి రోజుమార్చి రోజు మున్సిపల్ నీరు అందిస్తున్నారని, జిల్లాలో ఉన్న ఇతర మున్సిపాలిటీలో ప్రతిరోజు నీరు విడుదల చేసే పద్ధతి ఉందన్నారు. ఇప్పటికీ పట్టణంలో అనేక ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని సమ స్యను పరిష్కరించడానికి ఎంత సమయం కావాలో ఎన్నికలలో పోటీచేసే అభ్య ర్థులు ప్రజలకు తెలియచేయాలని ఆయన కోరారు.

ప్రజాగళంకు వచ్చిన వ్యక్తి అదృశ్యం

చిలకలూరిపేట, మార్చి 19: ప్రజాగళం సభకు హాజరై ఒక వ్యక్తి తప్పిపోయి నట్లు అతడి కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా కాకు మాను మండలం కాకుమాను గ్రామానికి చెందిన ఆరె సుబ్బారావు ప్రజాగళం సభకు హాజరయ్యాడు. అనంతరం అతడి ఆచూకీ తెలియరాలేదు. అతడికి మాటలు రావని, ఒక కాలుకు కట్టుకట్టి ఉన్నదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు అతడి సమాచారాన్ని మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావుకు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులకు కూడా ఈ మేరకు ఫిర్యాదు చేశామన్నారు. వివ రాలు తెలిసినవారు 9959045000 సెల్‌నంబర్‌కు తెలియచేయాలని కోరారు.

జగన్‌ను కలిసిన మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట, మార్చి 19: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ నాయకుడు మల్లెల రాజేష్ నాయుడు మంగళవారం తాడేపల్లి ప్యాలెస్‌లో ముఖ్య మంత్రి జగన్‌ను కలిశారు. తాడేపల్లి నుంచి వచ్చిన పిలుపుమేరకు రాజేష్ నాయుడు మున్సిపల్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావుతో కలిసి తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లారు. సుమారు రెండు గంటలసేపు అక్కడ ఉన్నారు. మధ్యలో జగన్‌ను రాజేష్ నాయుడు కలిశారు. తాను చెప్పదలుచుకున్న విషయాలను రాజేష్ నాయుడు జగన్‌కు తెలిపారు. రెండు మూడు రోజులలో వైవీ సుబ్బారెడ్డి, పార్టీకి చెందిన ఇతర ముఖ్య నేతలు అన్ని విషయాలు మాట్లాడి సరిచేస్తారని జగన్ రాజేష్ నాయుడుతో చెప్పినట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వరకుమార్

ఈసీ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి

● తహసీల్దార్ వరకుమార్

నాదెండ్ల, మార్చి 19: ఎన్నికల సంఘం నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాల్సిందేనని తహసీల్దార్, ఎఈఆర్‌వో వరకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల నియమావళి, ఆయా టీంలు అనుసరించాల్సిన వైఖరిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటుచేసిన రాజకీయపార్టీల ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలన్నారు. ప్రతి రాజకీయ పార్టీ కూడా ఎన్నికల ఆదే శాలను పాటించాలని లేనిపక్షంలో ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యుల వుతారన్నారు. ఆయా గ్రామాల్లోని కార్యాలయాల్లో ఎన్నికల సంఘం నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న రంగులను తొలగించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యద ర్శులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, ఎంఈవో-2 కృష్ణారెడ్డి, ఏవో హరికృష్ణ, ఏఈఈలు సూర్య తేజ, రమణారెడ్డి, బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.